# విశాల భారతి

25-01-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 24




## ఎర్రవల్లిలో బీఆర్ఎస్ 'సిట్టింగ్'

### తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నఫోన్ ట్యాపింగ్

గులాబీ పార్టీ అగ్ర నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది

ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన కీలక భేటీ

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది

పాల్గొన్న కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, సీనియర్ నేతలు

సిట్ విచారణలో ఎదురైన ప్రశ్నలపై చర్చించినట్లు సమాచారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు గులాబీ పార్టీ అగ్ర నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శనివారం మధ్యాహ్నం గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్ వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన కీలక భేటీ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఇతర సీనియర్ నేతలందరూ కేసీఆర్‌తో భేటీ కావడం వెనుక ట్యాపింగ్ విచారణ

మిగతా 2లో..

# కాంగ్రెస్‌లో బొగ్గు సెగలు..!



### తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులు



కాంగ్రెస్ సీనియర్ నేతల మధ్య అంతర్గతపోరు

సీఎం రేవంత్ రెడ్డికి పెను సవాలుగా మారింది

సింగరేణి బొగ్గు గనుల వేలం మంత్రుల మధ్య చిచ్చు

భట్టి,కోమటిరెడ్డి మధ్య సఖ్యత లోపించిందనే వార్తలు

కాంగ్రెస్‌కి గొడవలే ఎక్కువ నష్టం కలిగిస్తున్నాయని

**తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన బీఆర్ఎస్ పార్టీని, అపర చాణక్యుడిగా పేరుగాంచిన కేసీఆర్‌ను గద్దె దించి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి పోషించిన పాత్ర అసాధారణమైనది. బాహుబలి తరహాలో పార్టీలోకి ప్రవేశించి, అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ శ్రేణులను ఏకం చేసి, బలమైన యంత్రాంగం కలిగిన ప్రత్యర్థిని ఓడించడం రేవంత్ రాజకీయ చతురతకు నిదర్శనం. అయితే, అధికారాన్ని దక్కించుకోవడం ఒక ఎత్తయితే, దానిని నిలబెట్టుకోవడం, ముఖ్యంగా సొంత పార్టీలోని సీనియర్ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం రేవంత్ రెడ్డికి ఇప్పుడు పెను సవాలుగా మారింది.**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో ఈ ప్రభుత్వం కేవలం మూడు లేదా ఆరు నెలలకే కుప్పకూలుతుందని ప్రతిపక్ష నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు జోస్యం చెప్పారు. కానీ, ఆ అంచనాలను పటాపంచలు చేస్తూ రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనను విజయవంతంగా పూర్తి చేశారు. కేసీఆర్ లాంటి ఉద్దండుడిని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారు. తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ తర్వాత అంతటి పట్టుదల, వ్యూహరచన కలిగిన నాయకుడిగా రేవంత్ రెడ్డి తన ముద్ర వేసుకున్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ పాలనలో తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొన్న తాజా పరిస్థితులు కలవరపెడుతున్నాయి. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కళ్యాణ్, నారా లోకేష్ మధ్య విభేదాలు వస్తాయని, తద్వారా తాము లాభపడవచ్చని వైసీపీ ఎలా ఎదురుచూస్తోందో, ఇక్కడ తెలంగాణలో కూడా కాంగ్రెస్ సీనియర్లు తిరుగుబాటు చేస్తారని బీఆర్ఎస్ ఆశగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ నైజమే ఒక "కప్పల తక్కెడ" అని, ఎప్పుడు ఎవరు ఎటు దూకుతారో తెలియదని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు బలం చేకూర్చేలా తాజా పరిణామాలు ఉన్నాయి. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల వేలం అంశం ఇప్పుడు మంత్రుల మధ్య చిచ్చు పెట్టినట్లు కనిపిస్తోంది. సింగరేణి వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి కీలక నేతల మధ్య సఖ్యత లోపించిందనే వార్తలు రాజకీయ

మిగతా 3లో..

## టీహబ్ స్టార్టప్‌లకే సొంతం

స్టార్టప్‌ల సంస్కృతిని బలోపేతం చేసేందుకు టీ హబ్

ప్రాధాన్యతను తగ్గించే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ స్పష్టం

టీ-హబ్ ఉనికిని కాపాడటమే ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు

ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడం సరికాదనే అభిప్రాయం

టీ-హబ్‌ను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై నూతన ఆవిష్కరణలకు చిరునామాగా, వేలాది మంది యువ పారిశ్రామికవేత్తల కలల సౌధంగా విరాజిల్లుతున్న టీహబ్ ప్రాధాన్యతను తగ్గించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గత కొద్ది రోజులుగా టీహబ్ ప్రాంగణంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారంటూ వస్తున్న వార్తలు ఐటీ రంగంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని ఐటీ ఎకోసిస్టమ్ ప్రతిష్ట దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ఆయన అక్కడి నుంచే ఫోన్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావుతో మాట్లాడిన సీఎం, టీహబ్ ఉనికిని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు. టీహబ్ అనేది కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించిన ఒక భవనం మాత్రమే కాదని, అది తెలంగాణ మేధోశక్తికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఒక గొప్ప చిహ్నమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ దిగ్గజాలు హైదరాబాద్ వైపు చూస్తున్న తరుణంలో, అంకుర సంస్థల కోసం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. నగరంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న



ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు తరలించాలనే ప్రతిపాదనలు ఏవైనా అధికారుల స్థాయిలో ఉంటే, వాటిని వెంటనే బుట్టదాఖలు చేయాలని ఆయన కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ జోక్యం వల్ల అక్కడి సృజనాత్మక వాతావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్‌గా వెలుగొందుతున్న టీహబ్‌ను అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. స్టార్టప్‌లకు అవసరమైన స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించినప్పుడే కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని, అప్పుడే వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో..



## కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడు దొంగలు

- మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు
- ఫోన్ ట్యాపింగ్, సింగరేణి వ్యవహారంపై మాట్లాడారు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని ధ్వజమెత్తారు
- సిట్ విచారణ తీరుపై అనేక సందేహాలు వ్యక్తం చేశారు
- ప్రధాన సూత్రధారులను సాక్షులుగా పిలవడమేంటన్నారు
- సిట్ అధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని వెల్లడించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర రాజకీయాల్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మొదలుకొని సింగరేణి అవినీతి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన, రెండు పార్టీల తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో

మిగతా 3లో..

## సింగరేణిపై ఏ గద్దని వాలనీయను

### సింగరేణి సంస్థ తెలంగాణ వెన్నెముక వంటిది

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు

కొందరు కుట్రపూరిత కథనాలు వండి వారుస్తున్నారన్నారు

నైని బొగ్గు బ్లాక్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వెల్లడి

ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు వేయడం సరికాదన్నారు

వాస్తవాలు బయటపడతాయని ఆయన ధ్వజమెత్తారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, అటువంటి ప్రతిష్టాత్మక సంస్థపై రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం గమనార్హమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి, కొందరు కావాలని కుట్రపూరిత కథనాలు వండి వారుస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. నైని బొగ్గు బ్లాక్ కేటాయింపుల వ్యవహారంపై

మిగతా 2లో..

# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

- నాంపల్లి ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది
- ఫర్నిచర్ షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది
- ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది
- దీంతో నుమాయిష్ ఎగ్జిబిషన్ నిలిచిపోయింది
- పోలీసులు రంగంలోకి దిగి భద్రతా చర్యలు చేపట్టారు
- రసాయన పదార్థాల వల్ల అగ్నికీలలు ఉధృతంగా మారాయి







**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని అత్యంత కీలకమైన, వాణిజ్య పరంగా రద్దీగా ఉండే నాంపల్లి ప్రాంతం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానిక ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఒక ప్రముఖ ఫర్నిచర్ షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. మంటలు అదుపులేకుండా ఎగసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనతో నాంపల్లి పరిసరాల్లో సాధారణ జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా ప్రస్తుతం కొనసాగుతున్న నుమాయిష్ ఎగ్జిబిషన్ కారణంగా జనం భారీగా తరలివచ్చే సమయం కావడంతో

మిగతా 3లో..

## రేవంత్ బామ్మర్ది కోసమే బొగ్గు స్కాం

- సింగరేణి వివాదంపై హరీష్ రావు నిప్పులు చెరిగారు
- ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ధ్వజమెత్తారు
- భట్టి మాటలు మసిబూసి మారేడు కాయ చేసేలా ఉన్నాయి
- అవినీతిని కప్పిపుచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు
- తప్పే జరగకపోతే టెండర్లను ఎందుకు రద్దు చేశారని నిలదీశారు
- మౌనం అవినీతికి వత్తాసు పలికినట్లే అవుతుందన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సింగరేణి బొగ్గు గనులు, సోలార్ విద్యుత్ టెండర్ల ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన విలేకరుల సమావేశంపై స్పందించిన ఆయన, ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భట్టి మాటలు మసిబూసి మారేడు కాయ చేసేలా ఉన్నాయని,

మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమైన బీఆర్ఎస్



- బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల నగారా మోగించింది
- పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది
- సమన్వయకర్తల జాబితాను అధికారికంగా విడుదల
- ఎన్నికల క్షేత్రంలో ముందే ఉండాలని పార్టీ భావిస్తోంది
- సీనియర్ నేతలకు ఈ బాధ్యతలు అప్పగించింది

# ఎర్రవల్లిలో బీఆర్ఎస్ 'సిట్టింగ్'

**మొదటిపేజీ తరువాయి**

భయం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. శుక్రవారం నాడు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ కార్యాలయంలో కేటీఆర్ సుమారు ఏడు గంటల పాటు విచారణ ఎదుర్కోవడం, ఆ వెంటనే మరుసటి రోజే అగ్రనేతలందరూ ఫామ్ హౌస్‌కు క్యూ కట్టడం వెనుక ఏదో బలమైన కారణం ఉందనే ప్రచారం ఊపందుకుంది. సిట్ విచారణలో ఎదురైన ప్రశ్నలు, అధికారులు సేకరించిన ఆధారాలపై కేసీఆర్ కు వివరించి, తదుపరి వ్యూహాన్ని ఖరారు చేసేందుకే ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది.

ఈ ట్యాపింగ్ ఉదంతంలో ప్రభుత్వం దూకుడు పెంచడం బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. కేవలం కేటీఆర్, హరీష్ రావులకే పరిమితం కాకుండా, రానున్న రోజుల్లో స్వయంగా కేసీఆర్‌ను కూడా విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ముఖ్యంగా కేసీఆర్ కుమార్తె కవిత, ఆమె భర్త అనిల్ కుమార్ కూడా ఈ ట్యాపింగ్ బాధితుల జాబితాలో ఉండటం పెను సంచలనంగా మారింది. రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే కాకుండా, సొంత కుటుంబ సభ్యులపై కూడా నిఘా పెట్టారనే ఆరోపణలు బీఆర్ఎస్ అధినేతను ఇరకాటంలో పడేస్తున్నాయి. కన్న కూతురు, అల్లుడి ఫోన్లను కూడా వదలకుండా ట్యాపింగ్ చేయించారంటే, అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌లో ఎంతటి అభద్రతా భావం, అనుమానం పేరుకుపోయాయో అర్థమవుతోందని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఈ వ్యవహారంపై కేటీఆర్ అనుసరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. విచారణకు హాజరయ్యే ముందు వరకు అసలు ట్యాపింగే జరగలేదని, ఇదంతా ప్రభుత్వ డ్రామా అని కొట్టిపారేసిన ఆయన, ఇప్పుడు స్వరం మార్చినట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు తన సోదరి కవిత చేసిన ఆరోపణలపై మౌనంగా ఉన్న కేటీఆర్, ఇప్పుడు విచారణ తర్వాత వింత వాదనలు తెరపైకి తెస్తున్నారు. రాజుల కాలం నుండి ట్యాపింగ్ అనేది సహజంగా జరుగుతున్న ప్రక్రియేనని, ఇది కొత్తేమీ కాదన్నట్లుగా ఆయన మాట్లాడుతుండటం గమనార్హం. గతంలో అసలు ట్యాపింగే లేదని బుకాయించిన నేతలు, ఇప్పుడు అది చట్టబద్ధమేనని సమర్థించుకునే స్థాయికి రావడం వారి ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తోంది. ఈ మార్పు వెనుక తాము చట్టపరంగా చిక్కుల్లో పడ్డామనే భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.



కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నేతలు చెబుతున్నట్లుగా ఈ ట్యాపింగ్ చట్టబద్ధంగానే జరిగి ఉంటే, ఆ వివరాలను బహిర్గతం చేయడానికి ఎందుకు జంకుతున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ట్యాపింగ్ చేయాల్సి వస్తే దానికి కొన్ని పద్ధతులు, అనుమతులు అవసరమవుతాయి. కానీ ఎవరి అనుమతి లేకుండా, ఇష్టానుసారంగా వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేయడం అనేది రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చట్టబద్ధంగా జరిగి ఉంటే ఎవరెవరి ఫోన్ నెంబర్లను ట్యాప్ చేశారో జాబితా బయటపెట్టే ధైర్యం గులాబీ నేతలకు ఉందా అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే, ఈ కేసులో ఉచ్చు బిగుస్తున్నట్లు అర్థమవుతోంది. అంతిమంగా ఈ ట్యాపింగ్ వ్యవహారం కేసీఆర్ చుట్టూనే తిరుగుతుండటం పార్టీలో వణుకు పుట్టిస్తోంది. ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలు లేకుండా ఇంత పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరగడం అసంభవమని విచారణ అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఒకవేళ కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలిస్తే, తెలంగాణ రాజకీయాల్లో అది భారీ కుదుపునకు దారితీసే అవకాశం ఉంది. చట్టబద్ధత వాదనల వెనుక దాక్కునే ప్రయత్నం చేసినా, విచారణలో వెలుగు చూస్తున్న ఆధారాలు గులాబీ దళాన్ని ఇరకాటంలోకి నెడుతున్నాయి. ఎర్రవల్లి సమావేశంలో కేసీఆర్ తన నేతలకు ఎలాంటి దిశానిర్దేశం చేశారు, రానున్న రోజుల్లో విచారణ సంస్థల ముందు వీరు ఎలా వ్యవహరిస్తారనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. బీఆర్ఎస్ శ్రేణుల్లో ప్రస్తుతం నెలకొన్న గందరగోళం చూస్తుంటే, ట్యాపింగ్ అంశం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా న్యాయపరమైన చిక్కులకు దారితీస్తుందని స్పష్టమవుతోంది. కవిత అరెస్టు తర్వాత పార్టీ ఇప్పటికే ఇబ్బందుల్లో ఉండగా, ఇప్పుడు ట్యాపింగ్ కేసు అగ్రనాయకత్వాన్ని టార్గెట్ చేయడం శోచనీయం. కేటీఆర్ తన విచారణలో ఇచ్చిన సమాచారం ఆధారంగానే తదుపరి నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తానికి, ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బీఆర్ఎస్ భవిష్యత్తును ఏ తీరానికి చేరుస్తుందో వేచి చూడాలి. ఈ ఉత్కంఠభరిత పరిణామాల నేపథ్యంలో, కేసీఆర్ తదుపరి అడుగు ఏ విధంగా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రాతినిధ్య సంఘ ప్రతినిధులతో స్ట్రక్చర్ సమావేశం



**రామగుండం, విశాలభారతి**

రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో శనివారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఎస్ఓటు జియం బండి సత్య నారాయణ, లతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశం లో సెంటినరీ కాలనీలో గల పాడైపోయిన నీటి బోర్లను మరమ్మత్తు చేయించడం, సెంటినరీ కాలనీ లో పాడైపోయిన అంతర్గత రోడ్లను కార్పొరేట్ కార్యాలయం లో మాట్లాడి రోడ్లను మరమ్మత్తు చేయడం, రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ప్రాక్టీస్ కొరకు సింథటిక్ పిచ్ ను ఏర్పాటు చేయడం, సిహెచ్పి కి ఉద్యోగులు వెళ్లే దారిలో గల మట్టి రోడ్డును సిసి లేదా బిటి రోడ్ వేయించడం, డిపార్ట్మెంటులలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు 26 జనవరి, 15 ఆగస్టు, సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఉత్తమ ఉద్యోగి అవార్డు ఇవ్వడం, అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో, క్వారీ లో దుమ్ము రాకుండా వాటర్ స్ప్రిన్క్లర్ సిస్టంను ఏర్పాటు చేయడం, అడ్రియాల లాంగ్ వాల్ గని లో ఎఫ్ బి ఎల్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎస్కావేషన్ గ్రేడ్ కల్పించడం , స్విమ్మింగ్ పూల్ కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచడం, సీ2 క్వార్టర్స్ వైపు గేట్ అమర్చడం, స్విమ్మింగ్ పూల్ లో ఇంటర్నల్ డ్రైనేజ్ గాడ్స్ ఏర్పాటు చేయడం, కోల్ కన్వేర్ వెంబడి వాటర్ స్ప్రే చేయడానికి ఎంసిసి సంపులో నీరు ఉండే విధంగా చూడడం, ఓసిపి 1, ఓసిపి 2 ఉపరితల గనులలో డంపర్లు, గ్రేడర్లల తో పాటు అన్ని యంత్రాలలో వేసవికాలం ఏసీలు పనిచేసే విధంగా చూడడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిఎంలు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదే విధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# రేవంత్ బామ్మర్ది కోసమే బొగ్గు స్కాం

**మొదటిపేజీ తరువాయి**

జరిగిన అవినీతిని కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోందని హరీష్ రావు ఆరోపించారు. అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక సాకులు వెతుకుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. నైనీ బ్లాక్ టెండర్లను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హరీష్ రావు కీలక ప్రశ్నలు సంధించారు. అసలు తప్పే జరగకపోతే టెండర్లను ఎందుకు రద్దు చేశారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. టెండర్ల రద్దు ప్రకటన వెనుక భారీ కుంభకోణం దాగి ఉందనడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది ఈ వ్యవహారంలో రింగ్ మెన్‌గా వ్యవహరించారని, ఆయన ఆర్థిక ప్రయోజనాల కోసమే ఈ నిబంధనలను రూపొందించారని హరీష్‌రావు ఆరోపించారు. నైనీ టెండర్ రద్దు చేసిన ప్రభుత్వం, అదే తరహా వివాదాస్పద నిబంధనలతో పిలిచిన ఇతర టెండర్లను ఎందుకు రద్దు చేయలేదని ఆయన ప్రశ్నించారు.

సింగరేణిలో సోలార్ పవర్ టెండర్ల వ్యవహారంలో జరిగిన అక్రమాలను తాను ఆధారాలతో సహా బయటపెట్టినప్పటికీ, ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్క తన సుదీర్ఘ ప్రెస్ మీట్‌లో సోలార్ స్కామ్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. కేవలం తమకు అనుకూలంగా ఉండే అంశాలను మాత్రమే ప్రస్తావిస్తూ, అసలు కుంభకోణం జరిగిన సోలార్ టెండర్ల జోలికి వెళ్లకపోవడం వెనుక పెద్ద గూడుపుఠాణీ ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మౌనం అవినీతికి వత్తాసు పలికినట్లే అవుతుందని ఆయన విమర్శించారు.

టెండర్లలో ప్రవేశపెట్టిన సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనపై భట్టి విక్రమార్క ఇచ్చిన వివరణను హరీష్ రావు కొట్టిపారేశారు. ఈ నిబంధన 2018 నుంచి అమల్లో ఉందని చెబుతూ ఆ నెపాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేయడం హాస్యాస్పదమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చూపినంత మాత్రాన ప్రస్తుత టెండర్లలో జరిగిన అవినీతి కనుమరుగైపోదని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను అడ్డం పెట్టుకుని అర్హులైన కంపెనీలను కావాలనే పోటీ నుంచి తప్పించారని, కేవలం తమకు కావాల్సిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టడమే లక్ష్యంగా ఈ తతంగం నడిచిందని ఆరోపించారు. ప్రభుత్వంపై వస్తున్న ఈ ఆరోపణలు సామాన్యమైనవి కావని, నేరుగా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందనే విమర్శలు వస్తున్నాయని హరీష్ రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిష్పక్షపాత విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించడం ఒక్కటే మార్గమని ఆయన డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్కపై తనకు గౌరవం ఉందని చెబుతూనే, ఒకవేళ ఆయన నిజాయితీగా విచారణ జరిపిస్తామని హామీ ఇస్తే తాను కూడా లేఖ రాయడానికి సిద్ధమని ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కప్పిపుచ్చే ధోరణి వీడి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.



సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, అటువంటి సంస్థను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం శోచనీయమని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్ల సంస్థకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తాము పారదర్శకంగా పాలన సాగించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం కుంభకోణాలమయంగా మారిందని విమర్శించారు. టెండర్ల రద్దుతో ప్రభుత్వం తమ తప్పును అంగీకరించినట్లయిందని, ఇప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉందని, దీనిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో కంపెనీలను వేధించడం సరికాదని, స్వేచ్ఛాయుత పోటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి బావమరిది హస్తం ఉందనే ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోందని, కేవలం రాజకీయ ప్రసంగాలతో పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, ప్రజలకు నిజాలు తెలిసే వరకు విశ్రమించబోమని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం చేస్తున్న వాదనల్లో పస లేదని, కేవలం సాంకేతిక కారణాలను సాకులుగా చూపి అవినీతిని సమర్థించుకునే ప్రయత్నం చేస్తోందని హరీష్‌రావు మండిపడ్డారు.

# టీ-హబ్ స్టార్టప్‌లకే సొంతం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ విభాగాల రాక వల్ల అక్కడ ఉండే యువ పారిశ్రామికవేత్తలకు అసౌకర్యం కలగకూడదని, వారి ఆలోచనలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదని ఆయన అధికారులకు సూచించారు. ఐటీ రంగ అభివృద్ధిలో టీహబ్ పోషిస్తున్న పాత్రను విస్మరించి, దానిని సాధారణ కార్యాలయ భవనంగా చూడటం భావ్యం కాదని ఆయన హితవు పలికారు.



ప్రభుత్వ కార్యాలయాలకు స్థల సమస్య ఉంటే దానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సీఎం సూచించారు. నగరంలో అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలను పరిశీలించాలని, అవసరమైతే కొత్త వసతులను ఏర్పాటు చేసుకోవాలి తప్ప, ప్రతిష్ఠాత్మకమైన టీహబ్ నిర్మాణ ఉద్దేశాన్ని నీరుగార్చవద్దని స్పష్టం చేశారు. ఒకవైపు విదేశీ పర్యటనల్లో భాగంగా ప్రపంచ స్థాయి కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్న తరుణంలో, ఇక్కడ ఉన్న వ్యవస్థలను బలహీనపరిచే నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వ విధానానికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఐటీ శాఖ, పరిశ్రమల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, స్టార్టప్‌లకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. తెలంగాణను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇందులో టీహబ్ ఒక కీలకమైన 'ఐకాన్' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడిదారులు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు మొదట సందర్శించే ప్రదేశాలలో టీహబ్ ఒకటని, అటువంటి చోట ప్రభుత్వ ఫైళ్ల సందడి, సాధారణ పరిపాలనా విభాగాల రద్దీ ఉండటం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. సృజనాత్మకతకు, నూతన ఆలోచనలకు కేంద్రంగా ఉండాల్సిన చోట అధికార యంత్రాంగం తిష్టవేస్తే, అది అంకుర సంస్థల స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే టీహబ్‌ను కేవలం ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా మాత్రమే కొనసాగించాలని ఆయన ఖరాకండిగా చెప్పారు.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్టార్టప్‌లు నిలదొక్కుకోవాలంటే వారికి ప్రభుత్వ మద్దతు ఎంతో అవసరమని, ఆ మద్దతు వసతుల కల్పన రూపంలో ఉండాలి తప్ప, వారి స్థలాన్ని ఆక్రమించే విధంగా ఉండకూడదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రక్రియలో టీహబ్ ఒక ప్రధాన భూమికను పోషిస్తోందని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో టీహబ్ నుంచి మరిన్ని యునికార్న్ కంపెనీలు రావాలని, అందుకు తగిన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఎల్లప్పుడూ అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించినా సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ఐటీ రంగ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల తరలింపు వార్తలతో ఆందోళనలో ఉన్న యువ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆదేశాలు పెద్ద ఊరటనిచ్చాయి. ఐటీ రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం ద్వారా మరోసారి నిరూపించుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. భౌతికంగా అందుబాటులో ఉన్న స్థలం కంటే, అక్కడ నెలకొన్న 'ఇన్నోవేషన్ కల్చర్' ముఖ్యమని గుర్తించడం శుభపరిణామమని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ జోక్యం లేని పక్షంలోనే స్టార్టప్‌లు ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకోగలవని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో టీహబ్‌లోకి ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ప్రక్రియకు తక్షణమే బ్రేక్ పడింది. ఐటీ శాఖ అధికారులు ఇప్పుడు ఇతర ప్రత్యామ్నాయ భవనాల వేటలో పడ్డారు. టీహబ్‌లోని ఖాళీగా ఉన్న బ్లాకులను కేవలం కొత్తగా వచ్చే స్టార్టప్‌లకు, ఇంక్యుబేటర్లకు మాత్రమే కేటాయించాలని నిర్ణయించారు. దీనివల్ల మరిన్ని అంకుర సంస్థలకు చోటు లభించడమే కాకుండా, రాష్ట్రంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ మరింత విస్తరించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి దూరదృష్టితో తీసుకున్న ఈ నిర్ణయం ఐటీ రంగంలో విశ్వాసాన్ని పెంచిందని చెప్పవచ్చు.

అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి అక్కడి ప్రముఖ కంపెనీల సీఈవోలతో భేటీ అవుతూ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని కీలక సంస్థల పనితీరుపై కూడా ఆయన నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నారు. టీహబ్ విషయంలో వెలువడిన వార్తలపై తక్షణమే స్పందించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణ ఐటీ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజీ పడబోదని ఈ ఘటన ద్వారా స్పష్టమైంది.

## నేటి బాలికయే... రేపటి జాతి సంపద



**ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ**

**వేములవాడ, విశాలభారతి**

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వేములవాడలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీలో విద్యార్థులకు బాలికా దినోత్సవం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ " నేటి బాలికయే రేపటి జాతి సంపద అని, తల్లి గర్భంలో నలుసుగా పడింది మొదలు మన దేశంలో ఆడబిడ్డ ఎదురుకుంటున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని, ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా మహిళలు తమ జీవితాంతం ఎదుర్కొనే పెద్ద సమస్య లింగ వివక్షత, భారతదేశం ఆడపిల్లల హక్కులు, ఆమె విద్య ఆరోగ్యం , పోషకాహారం యొక్క ఆవశ్యకత గురించి అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నామని అన్నారు. బాలికల పట్ల కొనసాగుతున్న వివక్షను తొలగించి వారి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 2009 నుంచి ప్రతి ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నామని, మన అమ్మాయిలు జీవితాలకు వెలుగులు మరియు వారిని అలాగే చూసుకోవాలని, మన జీవితాల్లోని స్త్రీలను మనం ఎల్లప్పుడూ గౌరవించాలని, ఎందుకంటే వారు మన జీవితాలకు మూల స్తంభాలు అని, ఆడపిల్లలకు సాధికారత కల్పించి, విద్యను అందించి, సురక్షితంగా ఉంచాలని, ఆడబిడ్డలు రక్షించడం అంటే దేశాన్ని రక్షించడమేనని అన్నారు. ఆడపిల్లలను చులకనగా చూడొద్దని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని, ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి, చదువులో సరస్వతి, ఆదరించడంలో అన్నపూర్ణాదేవి ,కానీ ఇప్పటికీ ఆడపిల్ల అంటే ఓ టెన్షన్ అనే భావన చాలామందిలో ఉందని, అయితే ఆడపిల్ల అంటే టెన్షన్ కాదని టెన్ సన్స్ ( పదిమంది కుమారులు) కు సమానమని, నేటితరం బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, సమాజంలో బాలికల సంరక్షణ పై అవగాహన కల్పించడానికి బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించాలని, బాలికల విద్య సమాజపురోగతికి, ఆర్థిక బలోపేతానికి, కుటుంబానికి అత్యంత ఆవశ్యకమని, విద్యావంతులైన మహిళలు పేదరిక నిర్మూలన, బాల్య వివాహాల అరికట్టడం, నిర్ణయ అధికారం మరియు లింగ సమానత్వాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తారని, ఇది సమాజంలో ఆత్మ విశ్వాసాన్ని పెంచి, ఆరోగ్యకరమైన, జ్ఞానవంతమైన తర్వాతి తరాలను నిర్మించడానికి సహాయ పడుతుందని అన్నారు

# సింగరేణిపై ఏ గద్దని వాలనీయను

**మొదటిపేజీ తరువాయి**

ఇటీవల వెలువడిన వార్తా కథనాలు, విపక్షాల విమర్శలపై భట్టి విక్రమార్క శనివారం మీడియా సమావేశంలో సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థను అప్రతిష్టపాలు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. సింగరేణిలో ప్రత్యక్షంగా 42 వేల మంది, పరోక్షంగా 20 వేల మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, ఇలాంటి తప్పుడు రాతలు వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని ఉప ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ఉనికి కోసమో లేదా కొందరు దోపిడీదారుల ప్రయోజనాల కోసమో ఇటువంటి విషపు రాతలు రాస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు వేయడం ద్వారా రాష్ట్రానికి తీరని నష్టం చేస్తున్నారన్న విషయాన్ని సదరు శక్తులు గుర్తించాలని ఆయన హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదని భట్టి హితవు పలికారు.



నైని బొగ్గు బ్లాక్ టెండర్లలో 'సైట్ విజిటింగ్' నిబంధనను కొత్తగా చేర్చారని వస్తున్న ఆరోపణలను భట్టి విక్రమార్క తీవ్రంగా కొట్టిపారేశారు. ఈ నిబంధన తమ ప్రభుత్వం తీసుకువచ్చింది కాదని, దీనికి సుదీర్ఘ చరిత్ర ఉందని ఆయన స్పష్టం చేశారు. వాస్తవాలను పరిశీలించకుండా కేవలం ప్రభుత్వంపై బురద జల్లడమే ధ్యేయంగా కొందరు మేధావులు, రాజకీయ నాయకులు మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి తీసుకునే పరిపాలనాపరమైన నిర్ణయాలు నేరుగా మంత్రుల వద్దకు గానీ, మంత్రిమండలి వద్దకు గానీ రావని, అది ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

టెండర్ నిబంధనల వెనుక ఉన్న సాంకేతిక అంశాలను వివరిస్తూ, 2018లోనే కోల్ ఇండియా సంస్థ సింగరేణికి పంపిన టెండర్ ముసాయిదా పత్రాల్లో 'సైట్ విజిట్' తప్పనిసరి అని పేర్కొందని భట్టి వెల్లడించారు. అలాగే 2021లో సీఎంపీడీఎల్ సైతం ఇదే నిబంధనను ధృవీకరించిందని ఆయన సాక్ష్యాలను బయటపెట్టారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేదని, తాను ఉప ముఖ్యమంత్రిగా కూడా లేనని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్ఎండీసీ, దీన్ దయాల్ పోర్ట్ వంటి వాటితో పాటు రైల్వే శాఖ టెండర్లలో కూడా ఇటువంటి నిబంధనలు సర్వసాధారణమని ఆయన ఉదాహరణలతో వివరించారు.

పారదర్శకతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే ఎటువంటి అనుమానాలకు తావులేకుండా టెండర్ ప్రక్రియను నిలిపివేసి పునఃసమీక్షించాలని తాను ఆదేశించానని భట్టి విక్రమార్క తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు లేఖ రాయడం, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణకు ఆదేశించడాన్ని తాను స్వాగతిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. నిజాలు బయటకు వస్తేనే అసలైన దోషులు ఎవరో ప్రజలకు తెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అడ్డగోలుగా ప్రచారం చేసే వారి ముసుగులు త్వరలోనే తొలగిపోతాయని, వాస్తవాలు నిలకడగా బయటపడతాయని ఆయన ధ్వజమెత్తారు.

సింగరేణి సంస్థను గత పాలకులు ఏ విధంగా విస్మరించారో అందరికీ తెలుసని, ఇప్పుడు తాము ఆ సంస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుంటే అడ్డుతగులుతున్నారని భట్టి విమర్శించారు. ఒక పద్ధతి ప్రకారం కథనాలు రాయడం, వాటిపై లేఖలు సృష్టించడం వంటివి చూస్తుంటే దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. రాబందుల్లా సంస్థ ఆస్తులపై కన్నేసిన వారికి తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెబుతుందని ఆయన హెచ్చరించారు. ప్రతి అడుగులోనూ నిబంధనలకు లోబడే వ్యవహరిస్తున్నామని, ఎక్కడా అవినీతికి తావులేదని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే ఈ తప్పుడు ప్రచారాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారికి సింగరేణి కార్మికులు కర్రు కాల్చి వాత పెడతారని ఆయన అన్నారు. గతంలో ఇదే సంస్థలో జరిగిన అక్రమాలపై ఎందుకు మాట్లాడలేదని ఆయన విపక్షాలను ప్రశ్నించారు. పారదర్శకత గురించి మాట్లాడే హక్కు తమకే ఉందని, ఎటువంటి విచారణకైనా సిద్ధమని ఆయన ధీమాగా ప్రకటించారు.

సంస్థ ప్రతిష్టను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కేవలం రాజకీయ వైషమ్యాలతో వ్యవస్థలను నాశనం చేయవద్దని భట్టి కోరారు. ఇంగిత జ్ఞానం ఉన్న వారు ఎవరూ ఇటువంటి అసత్య కథనాలను నమ్మరని, ఆధారాలతో సహా తాము అన్ని విషయాలను బహిర్గతం చేస్తున్నామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా సింగరేణి ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి పాత్ర చిరస్మరణీయమని, దానిని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఆయన పునరుద్ఘాటించారు. చివరగా, భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు. అబద్ధాలను పదేపదే చెప్పడం ద్వారా నిజం చేయలేరని ఆయన ఎద్దేవా చేశారు. సాంకేతిక కారణాలను రాజకీయ అవసరాలకు వాడుకోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి సంబంధించిన ప్రతి పైసాను కాపాడుతామని, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని ఆయన ప్రత్యర్థులకు సూచించారు. సింగరేణి ఆస్తులను కొల్లగొట్టాలని చూసే శక్తుల ఆటలు సాగనివ్వబోమని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తప్పుడు రాతలు రాసే వారు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

# కాంగ్రెస్‌లో 'బొగ్గు' సెగలు..!

**మొదటిపేజీ తరువాయి**

వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ వివాదాన్ని అస్త్రంగా చేసుకున్న బీఆర్ఎస్, ప్రభుత్వంపై దాడిని తీవ్రం చేసింది. ముఖ్యమంత్రికి, మంత్రులకు మధ్య అగాధాన్ని సృష్టించేందుకు గులాబీ దళం శ్రమిస్తోంది. ఈ క్రమంలోనే భట్టి విక్రమార్క ఒక ప్రముఖ మీడియా సంస్థ అధినేతపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడటం, తనను ఈ వివాదంలోకి లాగడం వెనుక పెద్ద కుట్ర ఉందంటూ వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి బయటి శత్రువుల కంటే లోపలి గొడవలే ఎక్కువ నష్టం కలిగిస్తాయనేది చారిత్రక సత్యం. "కాంగ్రెస్ పార్టీని ఎవరూ ఓడించనవసరం లేదు, దానికి అదే ఓడించుకుంటుంది" అనే నానుడి రాజకీయాల్లో ప్రసిద్ధి. ఇప్పుడు రేవంత్ రెడ్డి నిర్మించుకున్న బలమైన కోటలో బీటలు వారుతున్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి. సీనియర్ మంత్రులు బాహాటంగా అసంతృప్తి వెళ్లగక్కడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట మసకబారడమే కాకుండా, పరిపాలనపై దాని ప్రభావం పడే అవకాశం ఉంది. ఇది అంతిమంగా ప్రతిపక్షాలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పరిణామాలను గమనిస్తూనే ఉన్నారు. పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై కఠినంగా ఉండటంతో పాటు, సీనియర్లను గౌరవిస్తూ వారిని కలుపుకుపోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. గతంలో అనేక సంక్షోభాలను ఎదుర్కొన్న అనుభవం ఉన్న రేవంత్, ఈ అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు ఇప్పటికే రంగంలోకి దిగి ఉంటారని భావిస్తున్నారు. నష్ట నివారణ చర్యలు చేపట్టకపోతే, కష్టపడి సాధించుకున్న అధికారం చేజారిపోయే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ ఇచ్చింది స్థిరమైన పాలన కోసం. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ప్రత్యామ్నాయంగా మార్పును కోరుకున్న ప్రజలకు, మంత్రుల మధ్య ఈ ఆధిపత్య పోరు నిరాశను మిగిలిస్తోంది. సింగరేణి వంటి సున్నితమైన అంశాల్లో పారదర్శకత అవసరమని, అదే సమయంలో పార్టీ నేతల మధ్య సమన్వయం మరింత ముఖ్యమని మేధావులు సూచిస్తున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, పొంచి ఉన్న ప్రతిపక్షం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు, బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని చాటుకోవడానికి దొరికిన ప్రతి చిన్న అవకాశాన్ని వాడుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగించడమే లక్ష్యంగా సోషల్ మీడియాలో, బహిరంగ సభల్లో విమర్శలు గుప్పిస్తోంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి తన కేబినెట్ సహచరులతో ముఖాముఖి చర్చలు జరిపి, అపోహలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐకమత్యంగా ఉంటేనే ప్రత్యర్థులను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయాలు తెలంగాణ రాజకీయ భవిష్యత్తును శాసించనున్నాయి. తన రాజకీయ చతురతతో కేసీఆర్‌నే ఓడించిన రేవంత్, సొంత పార్టీలోని విభేదాలను ఏ విధంగా చక్కదిద్దుతారో వేచి చూడాలి. సమన్వయ కర్తగా ఆయన సఫలమైతేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల కాల పరిమితిని పూర్తి చేయగలదు. లేని పక్షంలో, చరిత్ర పునరావృతమై కాంగ్రెస్ తన సొంత తప్పిదాల వల్లే అధికారాన్ని కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. తెలంగాణ రాజకీయం ఇప్పుడు ఒక క్లిష్ట దశలో ఉంది. రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇది ఒక పరీక్షా సమయం. ఒకవైపు ప్రజాకర్షక పథకాలు, మరోవైపు అంతర్గత విభేదాలు.. ఈ రెండింటి మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు సాగడం రేవంత్ కున్న ఏకైక మార్గం. త్వరలోనే ఆయన ఈ సంక్షోభం నుండి గట్టెక్కి, తన ప్రభుత్వాన్ని పటిష్టం చేసుకుంటారని పార్టీ కార్యకర్తలు ఆశాభావంతో ఉన్నారు.

# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

పోలీసులు రంగంలోకి దిగి అత్యవసర భద్రతా చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, సదరు ఫర్నిచర్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దుకాణంలో నిల్వ ఉంచిన సోఫాలు, మంచాలు, ఇతర కలప సామగ్రికి మంటలు వేగంగా అంటుకున్నాయి. ఫర్నిచర్ తయారీలో వినియోగించే ఫోమ్, పాలిష్ కెమికల్స్, ఇతర రసాయన పదార్థాల వల్ల అగ్నికీలలు మరింత ఉధృతంగా మారాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ వెంటనే స్పందించి పలు ఫైర్ ఇంజన్లను ఘటనా స్థలానికి తరలించింది. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ భారీ ప్రమాదం కారణంగా నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. నాంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు, మొజాంజాహి మార్కెట్ , అబిడ్స్ వైపు వెళ్లే ప్రధాన మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. శనివారం సెలవు దినం కావడంతో రోడ్లపై వాహనాల తాకిడి సాధారణం కంటే అధికంగా ఉండటం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకోవడానికి ట్రాఫిక్ అడ్డంకిగా మారడంతో, పోలీసులు రంగ ప్రవేశం చేసి వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు. ప్రస్తుతం నగరంలో ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ జరుగుతోంది. ప్రతి ఏటా లక్షలాది మంది సందర్శించే ఈ ప్రదర్శనకు శని, ఆదివారాల్లో రద్దీ విపరీతంగా ఉంటుంది. అయితే అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు అతి సమీపంలో ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎగ్జిబిషన్ సొసైటీ, పోలీస్ శాఖ సంయుక్తంగా కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. భారీ జనసమూహం మధ్య ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఈ ఘటనపై ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలకు పలు సూచనలు చేశారు. నాంపల్లిలో నెలకొన్న ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, శనివారం సాయంత్రం నుమాయిష్‌ను సందర్శించాలనుకునే వారు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని ఆయన కోరారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి మరియు అగ్నిమాపక సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా ఉండటానికి ప్రజలు ఈ ప్రాంతానికి రాకపోవడమే శ్రేయస్కరమని స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విజ్ఞప్తిని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

అగ్నిప్రమాదం వల్ల ఏర్పడిన దట్టమైన పొగ పరిసర ప్రాంతాల్లోని నివాసితులను ఇబ్బందులకు గురిచేసింది. గాలి నాణ్యత తగ్గడంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా సమీపంలోని కొన్ని దుకాణాలను మూసివేయించారు. అలాగే ప్రమాద స్థలికి ఎవరూ రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి రక్షణ వలయాన్ని నిర్మించారు. విపత్తు నిర్వహణ బృందాలు కూడా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాలుపంచుకున్నాయి. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

పోలీసు యంత్రాంగం, ఎగ్జిబిషన్ నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ జనసమూహాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేరుకున్న వారిని సురక్షితంగా బయటకు పంపేందుకు ప్రత్యేక మార్గాలను కేటాయించారు. మెట్రో రైలు సేవలను వినియోగించుకోవాలని, వ్యక్తిగత వాహనాల్లో నాంపల్లి వైపు రావద్దని నగరవాసులకు సూచించారు. సోషల్ మీడియా ద్వారా, ఎఫ్.ఎమ్ రేడియోల ద్వారా నిరంతరం ట్రాఫిక్ అప్‌డేట్లను అందిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణరక్షణే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని అధికారులు పునరుద్ఘాటించారు. ఈ ప్రమాదానికి సంబంధించి షార్ట్ సర్క్యూట్ కారణం కావచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అగ్నిప్రమాదం జరిగిన తీరు, భద్రతా ప్రమాణాల పాటించడంలో జరిగిన లోపాలపై ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు. షోరూమ్‌లో తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా లేదా అనే కోణంలో అధికారులు తనిఖీలు చేపట్టనున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్తి నష్టం భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు, అయితే పూర్తి వివరాలు మంటలు పూర్తిగా ఆరిన తర్వాతే వెల్లడిస్తామన్నారు. ముఖ్యంగా నుమాయిష్ సందర్శకులు పోలీసులకు సహకరించాలని, వదంతులను నమ్మవద్దని కోరారు. అదనపు పోలీసు బలగాలను మోహరించి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి వరకు పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమైన బీఆర్ఎస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల నగారా మోగించింది. రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు పార్టీ ఇన్‌ఛార్జిలను నియమిస్తూ భారత రాష్ట్ర సమితినిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం ఈ సమన్వయకర్తల జాబితాను అధికారికంగా విడుదల చేశారు. ఈ నియామకాల ద్వారా ఎన్నికల క్షేత్రంలో ప్రత్యర్థుల కంటే ఒక అడుగు ముందే ఉండాలని పార్టీ భావిస్తోంది. ప్రతి పురపాలికకు ఒక సీనియర్ నాయకుడిని బాధ్యుడిగా నియమించడం ద్వారా క్షేత్రస్థాయిలో కేడర్‌ను ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికలు జరగనున్న 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పరిధిలో పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేసేందుకు ఈ సమన్వయకర్తలు కీలక భూమిక పోషించనున్నారు. స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న, పార్టీ పట్ల విధేయత కలిగిన సీనియర్ నేతలకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు కేటీఆర్ వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే ఈ కసరత్తు పూర్తి చేయడం ద్వారా అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి జాప్యం లేకుండా చూసుకోవచ్చని పార్టీ భావిస్తోంది. నియోజకవర్గాల వారీగా కాకుండా పురపాలికల వారీగా ఇన్‌ఛార్జిలను కేటాయించడం వల్ల ప్రతి వార్డుపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని నాయకత్వం విశ్వసిస్తోంది. పార్టీ శ్రేణుల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చి, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే వీరి ప్రధాన విధిగా ఉండనుంది. సమన్వయకర్తల బాధ్యతల గురించి కేటీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ఫలితాలు వచ్చే వరకు వీరు తమకు కేటాయించిన మున్సిపాలిటీల్లోనే మకాం వేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలతో నిరంతరం టచ్‌లో ఉంటూ, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటిని ఎన్నికల అజెండాగా మార్చడంపై వీరు దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా వార్డు స్థాయి కమిటీలను బలోపేతం చేయడం, బూత్ లెవల్ ఏజెంట్లను సిద్ధం చేయడం వంటి సాంకేతిక అంశాలను కూడా వీరే పర్యవేక్షిస్తారు. ప్రచార కార్యక్రమాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పార్టీ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం వీరి బాధ్యతగా కేటీఆర్ పేర్కొన్నారు.



అభ్యర్థుల ఎంపిక అనేది ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఘట్టం కాబట్టి, ఇందులో ఇన్‌ఛార్జీలకు పార్టీ పెద్దపీట వేసింది. స్థానిక నేతలు, ఆశావహుల వివరాలను సేకరించి, గెలుపు గుర్రాలను గుర్తించి పార్టీ అధిష్ఠానానికి నివేదించాల్సి ఉంటుంది. సర్వే నివేదికలు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియలో వీరు ఇచ్చే నివేదికలే ప్రామాణికంగా ఉండనున్నాయి. సామాజిక సమీకరణాలు, బీసీ రిజర్వేషన్ల మార్పులను పరిగణనలోకి తీసుకుని సమతూకం పాటించేలా ఇన్‌ఛార్జీలు కసరత్తు చేయనున్నారు. విపక్షాల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, బలమైన అభ్యర్థులను బరిలోకి దించేలా క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా ఉంచాలని కేటీఆర్ సూచించారు.

పార్టీ కేంద్ర కార్యాలయంతో ఈ సమన్వయకర్తలు నిరంతరం సమన్వయం చేసుకునేలా తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో జరిగే పరిణామాలు, ప్రచార సరళి, ప్రత్యర్థుల వ్యూహాలను ఎప్పటికప్పుడు ఈ వ్యవస్థ ద్వారా పార్టీ అధిష్ఠానానికి చేరవేస్తారు. దీనివల్ల అవసరమైనప్పుడు తక్షణ నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని పార్టీ భావిస్తోంది. పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్ ఇచ్చే దిశానిర్దేశాలను తూచా తప్పకుండా అమలు చేసేలా ఈ సమన్వయ కర్తలు వారధిలా పనిచేస్తారు. డిజిటల్ మీడియా విభాగాన్ని కూడా సమన్వయం చేసుకుంటూ సోషల్ మీడియాలో పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించేలా వ్యూహరచన చేయనున్నారు.

మున్సిపల్ ఎన్నికల వేళ పార్టీ ఫిరాయింపుల భయం లేకుండా చూసుకోవడం ఇన్‌ఛార్జీల ముందున్న మరో సవాలు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి వెళ్లే అవకాశం ఉన్న అసంతృప్త నేతలను బుజ్జగించడం, వారికి పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇవ్వడం వంటి బాధ్యతలను వీరు నిర్వర్తించనున్నారు. పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న పాత కాపులను కలిసి వారి సేవలను వినియోగించుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకుని, ఎక్కడెక్కడ పొరపాట్లు జరిగాయో గుర్తించి వాటిని సరిదిద్దుకుంటూ ఈ ఎన్నికలకు వెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్రచార సామగ్రిని కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని కూడా ఈ ఎన్నికల్లో ప్రధాన అజెండాగా మార్చాలని పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను రద్దు చేసే యోచనలో ఉందన్న ఆందోళనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో పట్టణాల్లో జరిగిన అభివృద్ధిని, ముఖ్యంగా మిషన్ భగీరథ, రోడ్ల విస్తరణ, పార్కుల అభివృద్ధి వంటి అంశాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. అభివృద్ధి నిరోధక శక్తులకు గుణపాఠం చెప్పేందుకు ఈ మున్సిపల్ ఎన్నికలే సరైన వేదిక అని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రచారంలో దూకుడు పెంచి, ప్రజల మద్దతు కూడగట్టడంలో ఇన్‌ఛార్జీలు చురుకైన పాత్ర పోషించనున్నారు. ఎన్నికల నిబంధనలు, కోడ్ అమలుపై కూడా సమన్వయకర్తలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా న్యాయ సలహాదారుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఖర్చుల వివరాలు, ప్రచార అనుమతుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా యువతను, మహిళా ఓటర్లను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడంపై దృష్టి పెడుతున్నారు. ప్రతి వార్డులో కనీసం ఇద్దరు ముఖ్య నాయకులు ఇన్‌ఛార్జ్ పర్యవేక్షణలో పనిచేసేలా ఒక క్రమశిక్షణతో కూడిన యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రతి ఓటరును నేరుగా కలిసేలా ప్రణాళిక సిద్ధమైంది.

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ మున్సిపల్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. అందుకే పార్టీ తన సర్వశక్తులను ఒడ్డుతోంది. సీనియర్ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలను ఇన్‌ఛార్జీలుగా నియమించడం ద్వారా పార్టీలో సీరియస్‌నెస్ పెంచాలని కేటీఆర్ భావించారు. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే సార్వత్రిక ఎన్నికలకు దిక్సూచిగా మారతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే ఎక్కడా రాజీ పడకుండా ప్రతి సీటును గెలుచుకోవాలన్న పట్టుదలతో గులాబీ దళం ఉంది. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న బలమైన క్యాడర్‌ను ఓట్లుగా మలుచుకోవడంలో సమన్వయకర్తల నైపుణ్యం ఇప్పుడు పరీక్షకు గురికానుంది.

# ఓ కులమా...నీవెవరు?

ఓ కులమా...నీవెవరు?
తల్లిదండ్రులనే యమదూతలుగా మార్చి,
మనుషుల మధ్య పుట్టిన మనిషినే
మనుగడలేని వానిగా మార్చే నీ నియమాల వెనుక
దాగిన అబద్ధాల్ని చూశాం.

కడుపులో పుట్టిన బిడ్డనే
కాటికిలాకి తోలే క్రూరత్వమా నీవు?
మనుషుల మధ్య చిచ్చుపెట్టి
రక్త సంబంధాలనే బూడిద చేసే
విషపు విత్తనమా నీవు?

పరువు-ప్రతిష్టలకు
మారుపేరుగా మారి,
పరువుహత్యలకు
మూలాధారంగా నిలిచావు.

మనిషి మెదడునే
నీ స్థావరంగా చేసుకొని,
మనిషిని మరమనిషిగా మార్చి
ఆడిస్తావు నిశ్శబ్దంగా.

నిన్ను ప్రశ్నించడమే
నేరమయ్యేలా చేసి,
వ్యక్తిత్వం, ఆత్మాభిమానం
నీ రాతిగోడల మధ్య ఇరుక్కొని
నిట్టూర్పులు విడిచిన శబ్దాన్ని విన్నాం.

అవమానాలకు సూత్రధారివై
నీడలా వెంటాడి,
నిలువునా మనుషుల్ని
దీవించివేసే శక్తి నీదే.

నీ అధికారానికి ఎదురు నిలిస్తే చాలు,
మానవత్వమే మంటగలవలసిందే.

నీవే కొందరిని బంధీలుగా చేసి
బానిస బ్రతుకులిచ్చావు,
నీవే మరికొందరికి
నిచ్చెనగా మారి
అందలాలు ఎక్కించావు.

ఇంకెన్నాళ్లు నీ పరిపాలనతో
మా బ్రతుకులతో ఆడుకుంటావు?
మానవత్వం మరిచిన
నీ నాటకానికి ఒక రోజు ముగింపు తప్పదు.



బానోత్ దేవేందర్ అలియాస్ దేవన్న

## కామారెడ్డిలో కలకలం

- ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు
- కామారెడ్డి కలెక్టరేట్ లో ఏసీబీ సోదాలు
- భయం గుప్పెట్లో కలెక్టరేట్

**కామారెడ్డి విశాలభారతి:** కామారెడ్డి కలెక్టరేట్‌లో పౌరసరఫరా శాఖ కార్యాలయంలో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌరసరఫరాలకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులు, ఇతర ముఖ్యమైన పత్రాలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల సందర్భంగా కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తూ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. మత్స్య శాఖ నుంచి కూడా వివరాలు తీసుకున్నట్లు తెలిసింది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు సోదాలు జరిపారు. ఏసీబీ సోదాలకు సంబంధించి మీడియాకు ఎటువంటి సమాచారం విడుదల చేయలేదు. ఈ విషయమే అధికారులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## ఆరైవ్ అలైవ్ రోడ్డు భద్రతకు ఓ దిక్సూచి

**విశాలభారతి:**

మానవ జీవన గమనం కాలచక్రంపై ఆధారపడి సాగుతుండగా, నేటి యాంత్రిక యుగంలో రవాణా రంగానికి చక్రమే ప్రాణాధారమైంది. అయితే, పెరిగిన అవసరాలకు అనుగుణంగా విస్తరించిన రహదారులు, వాహనాల సంఖ్యతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్2026' కార్యక్రమం నేటి అవసరమని చెప్పవచ్చు. ముఖ్యంగా జనవరి 13 నుండి 24 వరకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక అవగాహన వారోత్సవాలు వాహనదారుల్లో చైతన్యం నింపడమే లక్ష్యంగా సాగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మానవ తప్పిదాలేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు అశ్రద్ధ చేయడం, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వంటివి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న మద్యం, మాదకద్రవ్యాల వ్యసనం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడటం వంటి ధోరణులు తీవ్ర విషాదాలకు దారితీస్తున్నాయి. మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కేవలం క్షణకాలం పాటు చూపే అశ్రద్ధ, ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఆ కుటుంబం మొత్తాన్ని ఆర్థికంగా, సామాజికంగా కోలుకోలేని దెబ్బ తీస్తుంది. రహదారి నిబంధనలు మన రక్షణ కవచాలని ప్రతి వాహనదారుడు గుర్తించాలి. రాత్రి వేళల్లో వాహన లైటింగ్‌పై దృష్టి పెట్టడం, మలుపుల వద్ద అప్రమత్తత, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద పాదచారులకు గౌరవం ఇవ్వడం వంటివి నాగరికతకు చిహ్నాలు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ, క్రమశిక్షణతో ప్రయాణించడం వల్ల మనతో పాటు తోటి ప్రయాణికులూ క్షేమంగా ఉంటారు. 'అరైవ్ అలైవ్' స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను ఒక జీవన శైలిగా మార్చుకున్నప్పుడే, రక్తసిక్తమవుతున్న రహదారులు సురక్షితమైన ప్రయాణ మార్గాలుగా మారుతాయి.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడు దొంగలు

**మొదటిపేజీ తరువాయి**

సిట్ విచారణ సాగుతున్న తీరుపై ఆయన అనేక సందేహాలు వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఉన్నవారిని సాక్షులుగా పిలవడమేంటని బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు వంటి నేతలను సాక్షుల జాబితాలో చేర్చడం ద్వారా అసలు దోషులెవరో తేల్చడంలో ప్రభుత్వం వెనకాడుతోందని విమర్శించారు. దొంగలను సాక్షులుగా మార్చడం అంటే విచారణను నీరుగార్చడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిట్ అధికారులకు ఇప్పటికైనా పూర్తి స్వేచ్ఛనివ్వాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగి పనిచేస్తే అధికారుల క్రెడిబిలిటీ దెబ్బతింటుందని హెచ్చరించారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, తాము ఏ తప్పూ చేయలేదని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ తన సవాల్‌ను స్వీకరించాలని ఆయన కోరారు. దైవ సాక్షిగా, తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్ద ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని వారిని నిలదీశారు.



ఫోన్ ట్యాపింగ్ ప్రక్రియలో మావోయిస్టుల పేరుతో తప్పుడు జాబితాలను రూపొందించారని బండి సంజయ్ ఆరోపించారు. మావోయిస్టుల నిఘా జాబితాలో హీరోయిన్లు, ప్రముఖ వ్యాపారవేత్తలతో పాటు సొంత పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల పేర్లను కూడా చేర్చడం అత్యంత దారుణమని విమర్శించారు. ఆఖరికి కేసీఆర్ తన సొంత బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ట్యాపింగ్ చేయించలేదా అని ఆయన ప్రశ్నించారు. ఇదంతా అధికార మదంతో చేసిన అప్రజాస్వామిక చర్య అని ఆయన అభివర్ణించారు.

సింగరేణి సంస్థ విషయంలో కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం సహకరించుకుంటూ దోచుకుంటున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం సింగరేణిని ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు, దళారులు అదే బాటలో పయనిస్తున్నారని విమర్శించారు. ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సింగరేణిలో జరిగిన అవినీతిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. బీఆర్ఎస్ లేఖ రాస్తే విచారణ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన ఆర్థిక దోపిడీపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న అక్రమాల గురించి అడిగితే గుజరాత్‌ను ప్రస్తావించడం కాంగ్రెస్ నేతల అసమర్థతకు నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కంటే స్వరాష్ట్రంలోనే సింగరేణి గనుల దోపిడీ అధికంగా జరుగుతోందని కేంద్రమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తమ ప్రాణాలకు తెగించి పోరాడి సాధించుకున్న తెలంగాణలో, వారి కష్టార్జితాన్ని రాజకీయ నాయకులు భోంచేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఇన్నాళ్లు మనుగడ సాగించిందంటే అది సింగరేణిలో దోచుకున్న సొమ్ముతోనేనని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నుంచి సుమారు 42 వేల కోట్ల రూపాయలను దారి మళ్లించిందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల లాభాల్లో ఉండాల్సిన సింగరేణి సంస్థ నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయిందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఎన్నో వాగ్దానాలు చేసే పార్టీలు, అధికారంలోకి రాగానే ఆ సంస్థ సంపదను పక్కదారి పట్టించడం అలవాటుగా మార్చుకున్నాయని విమర్శించారు. సింగరేణి ప్రాంత ప్రజలు మరియు కార్మికులు రెండు పార్టీల ద్వంద్వ వైఖరిని గమనిస్తున్నారని, త్వరలోనే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఆయన "తోడు దొంగలు"గా అభివర్ణించారు. "మా భాగోతం మీరు బయటపెట్టకండి.. మీ భాగోతం మేము బయట పెట్టము" అనే ఒప్పందంతో ఈ రెండు పార్టీలు ముందుకు సాగుతున్నాయని విమర్శించారు. ప్రజల కళ్లలో మట్టి కొట్టేందుకు పైకి విమర్శలు చేసుకుంటున్నా, లోపల మాత్రం పరస్పర ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# రైతన్నను వీడని యూరియా కష్టాలు

**తొమ్మిదిరేకులలో యూరియా కోసం రైతుల బారులు**



**కేశంపేట, విశాలభారతి:** రైతన్నను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.యూరియా వస్తుందంటే చాలు దానికోసం పనులను మానుకొని సొసైటీల ముందు బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో యూరియా కోసం రెండు రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఒక్కొక్క రైతుకు కేవలం రెండు,మూడు సంచులు మాత్రమే ఇస్తుండడంతో అవి కూడా దొరుకుతాయా దొరకవా అని పిఏసిఎస్ కేంద్రం ముందు మహిళలు, రైతులు లైన్లలో నిలబడి సంచుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి.శుక్రవారం యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో రైతులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి లైన్లో యూరియా కోసం పడిగాపులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వము, వ్యవసాయ అధికారులు యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే అసలు యూరియా కొరతే లేదని అంటే మరి రైతులు రోడ్లెందుకు ఎక్కుతున్నారని,యూరియా కోసం రైతులు నానా తిప్పలు పడుతుంటే ప్రభుత్వం మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందని, ఇది ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు, రైతుల మీద ఉన్న చిత్తశుద్ధి, నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామ మాజీ ఉప సర్పంచ్ పంది రామ్ రెడ్డి ఆరోపించారు.సరిపడా యూరియా నిల్వలు ఉంటే మరి వాటి కోసం రైతులు ఎందుకు బారులు తీరాల్సి వస్తుందో అధికారులే చెప్పాలని,ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



**పాల్వంచ, విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆడపిల్ల అనగానే సమాజంలో ఇప్పటికీ చిన్నచూపు కనిపిస్తోందని, కడుపులో ఉన్న శిశువు ఆడపిల్ల అని తెలిసిన వెంటనే భ్రూణహత్యలకు పాల్పడడం అత్యంత ఆందోళనకరమైన అంశమని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టిన తరువాత కూడా బాలికలపై అనేక ఆంక్షలు విధిస్తూ వివక్ష చూపుతున్న పరిస్థితులను నిర్మూలించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి టీజీ టీడబ్ల్యూఆర్డీసీ లెక్చరర్లు, మణుగూరు డిగ్రీ కళాశాలకి చెందిన డా. బి. ప్రవల్లిక మరియు సిహెచ్. అపర్ణ మాట్లాడుతూ బాలికల విద్య, సాధికారత, సమాన హక్కులు, మహిళా అభివృద్ధి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు ప్రతి రంగంలో ముందంజ వేయాలంటే సమాజం వారి వెన్నంటి నిలవాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ టి అరుణకుమారి డి రమేష్ డాక్టర్ వేముల కామేశ్వరరావు డాక్టర్ శెట్టి స్వరూప రాణి డాక్టర్ కొండలరావు పొట్లపు శ్రీనివాసరావు పారెల్లి శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ పర్వీన్ డాక్టర్ ఎన్ శ్రీదేవి డాక్టర్ పవన్ డాక్టర్ రమేష్ విమల కరిమ దీపిక వకుల హారిక ఈ శ్రీను భాను ప్రవీణ్ బాబ్జి ఖాన్, రాజ్ కుమార్ అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాల్వంచలో ఘనంగా పశువైద్య శిబిరం

**పేటచెరువు లో మైత్రి సెంటర్లో వైద్య సేవలు**



**పాల్వంచ, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పరిధిలోని పేట చెరువు గ్రామంలో మైత్రి సెంటర్ వద్ద శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ గారు జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో భాగంగా పరిసర ప్రాంతాల రైతులు తమ పశువులను తీసుకువచ్చారు. పశువైద్యాధికారులు పశువులకు క్షుణ్ణంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం పశువులకు అవసరమైన ఉచిత మందులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పశువైద్య నిపుణులు డాక్టర్ ఇందు తేజ (యానంబైలు పశువైద్యాధికారి),డాక్టర్ రాజేందర్ (మొరంపల్లి బంజర),రాంజీలాల్ (ఎల్.ఎస్.ఏ),సాయి ప్రకాష్ (గోపాలమిత్ర సూపర్వైజర్),మైత్రి రాము, అజ్గర్ , ప్రసాద్ (గోపాలమిత్ర)ఈ శిబిరం ద్వారా పెద్ద సంఖ్యలో పశువులకు వైద్య సేవలు అందడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# చెత్త బండ్లతో తప్పని తిప్పలు

- చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్రమైన దగ్గు
- శ్వాసకోస సమస్యలతో అనారోగ్యం పాలవుతున్నారు
- దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది



**పాల్వంచ విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంట గ్రామ సమీపంలో చెత్త తరలింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ సమీపంలో మున్సిపల్ అధికారులు విచ్చలవిడిగా చెత్తను కుమ్మరిస్తుండటం, సాయంత్రం వేళల్లో ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని నిరసిస్తూ శనివారం గ్రామస్తులు చెత్త తరలిస్తున్న మున్సిపల్ వాహనాలను అడ్డుకొని ఆందోళనకు దిగారు. మున్సిపాలిటీకి చెందిన చెత్తనంతా ఎర్రగుంట సమీపంలోనే వేస్తున్నారు. సాయంత్రం కాగానే ఈ చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో విషపూరితమైన పొగ ఊరంతా కమ్ముకుంటోంది. దీనివల్ల: చెత్త బండ్ల ముట్టడి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో, ఆగ్రహించిన గ్రామస్తులు ఈరోజు చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లను, వాహనాలను నిలిపివేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు, ఇక్కడ చెత్త వేయడం ఆపేవరకు కదిలేది లేదని గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు.

# డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

**యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులకు అభినందనలు**



**విశాలభారతి, ఖమ్మం:** టియుడబ్ల్యూజే (ఐ జే యు) జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ రూపొందించిన డైరీలను ఖమ్మం జిల్లా కలెక్టర్ దురుశెట్టి అనుదీప్ శనివారం ఖమ్మం లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. డైరీ ఆవిష్కరణ సందర్భంగా నాయకులకు, జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకటరావు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, కార్యదర్శి మహేందర్, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, జిల్లా నాయకులు ఏగినాటి మాధవరావు, ఏలూరి వేణుగోపాలరావు, పసుపులేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి

- ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం
- రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్
- కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

**విశాలభారతి, గోదావరిఖని:**



రామగుండం నియోజకవర్గం అభివృద్ధి రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేస్తున్న ప్రజాసేవకు అభివృద్ధికి ఆకర్షితులై రామగుండం మున్సిపల్ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన దండు రవీందర్, కాషావీణ రాజయ్య, మరియు వారితో పాటు 25 మంది నాయకులు శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ నాయకత్వంలో ఎమ్మెల్యే గారికి క్యాంపు కార్యాలయంలో మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి మరియు అధ్యక్షులు ఓర్సు అనిల్, డివిజన్ ఇంచార్జ్ మేకల పోచం గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు. రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాగూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్. మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఉన్న నియంతృత్వం పాలనకు ప్రభుత్వానికి స్వస్తి పలికి ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఏర్పరచారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారం చేపట్టిన సంవత్సరన్నర కాలంలోనే ప్రజల ఆశలను అనుగుణంగా ఒక్కొక్క హామీని అమలు పరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తున్నారని గత పాలకులు చేసిన అప్పులను తీరుస్తూనే ప్రజల కలలను సహకారం చేసే విధంగా పాలన కొనసాగుతున్నారని అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ రాష్ట్రాన్ని పురుగమన దిశగా నడిపిస్తున్నారని అలాగే గతంలో ఎన్నడు లేని విధంగా రామగుండం నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. గత పాలకులు రామగుండం నియోజకవర్గాన్ని దోచుకున్నారని అభివృద్ధిని గత పాలకులు మర్చిపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక రామగుండం నియోజవర్గంలో సుందరంగా మారుస్తున్నామని వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని అలాగే అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు మహిళా నాయకురాలు తదితరులుకార్యకర్తలు పాలుగోన్నారు.

# లొంగిపోయిన మావోయిస్టులు



**కమిషనర్ ఆఫ్ పోలీస్ రామగుండం అంబర్ కిశోర్ ఝా**

**విశాలభారతి, గోదావరిఖని:**

శనివారం నిషేదిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ సభ్యులు రామగుండం కమిషనరేటు పోలీసుల ఎదుట లొంగిపోవడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్నటువంటి వివిధ రకాల సహాయ సహకారాలు మరియు లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను గురించి తెలుసుకుని, తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని, కమీషనర్ ఆఫ్ పోలీస్ రామగుండం ఎదుట కమిషనరేటు కార్యాలయంలో లొంగిపోయారు. లొంగిపోయిన ఎనిమిది మంది వ్యక్తులు మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ వంటి విభాగాల్లో క్రియాశీలకంగా పని చేశారు. వీరు ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ మరియు తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించారు. మీ ఊరికి రండి.మావోయిస్టులకు పోలీస్ వారి ఆహ్వానం. ప్రస్తుత సమాజంలో యువత చైతన్యవంతంగా వ్యవహరిస్తున్నది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వారు దూరంగా ఉంటున్నారు. మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్మెంట్ పూర్తిగా తగ్గిపోయింది. చదువుతున్న వారు ఎవరు మావోయిస్టు పార్టీలోకి వెళ్ళడం లేదు. అజ్ఞాతం లో ఉన్న అదిలాబాద్ మరియు కరీంనగర్ జిల్లా మావోయిస్టులు కూడా వారి గ్రామాలకు తిరిగి రావాలని కోరుతున్నాం. ఈ సమావేశం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ లు రాజేంద్ర ప్రసాద్, భీమేష్, ఆర్ ఐ శేఖర్, ఆర్ ఎస్ ఐ లు వెంకట్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని బీఆర్ఎస్ అధోగతి పాలు చేసింది

- జీతాలు చెల్లించలేని పరిస్థితుల్లోకి నెట్టారు
- ఘనత నాటి ముఖ్యమంత్రి కెసిఆర్దే
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్



**విశాలభారతి, గోదావరిఖని:**

పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ బి ఆర్ ఎస్ పార్టీ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు శనివారం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతు. 2014 నుండి ఎంక్వైరీ కమిషన్ వేసి సింగరేణి సంస్థను దోచుకున్నది ఎవరో తేల్చుకుందామని రామగుండం ఎమ్మెల్యే సవాల్ విసిరారు. భూగర్భ గనులను పాతర పెట్టి రామగుండం ఊరు మధ్యలో ఉపరితల గనులను తెరిచి ఊరిని బొందల గడ్డగా మార్చారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు అబద్దాలను ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. నియోజకవర్గానికి కొత్త విద్యుత్తు పరిశ్రమలను తీసుకువస్తే జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు రేట్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణి సంస్థను విస్తృత పరుస్తున్న కాంగ్రెస్ నాయకులపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే డైవర్షన్ పాలిటిక్స్ ప్లే చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారాలమ్మ మహా జాతరకు స్పెషల్ బస్సులు

**విశాలభారతి, గోదావరిఖని:**

మేడారం సమ్మక్క సారాలమ్మ మహా జాతర 2026 సంవత్సరంను పురస్కరించుకొని గోదావరిఖని బస్ స్టేషన్ నుండి మేడారం జాతరకు 25/01/2026 ఆదివారం నుండి 01/02/2026 ఆదివారం వరకు ప్రతి రోజు 24 గంటలు జాతర స్పెషల్ బస్సులు నడుపబడును. ప్రయాణికుల సౌకర్యార్థం క్యాంపు వద్ద టెంట్స్ త్రాగునీరు మరుగుదొడ్ల సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ జాతర నిర్వహణ కోసం 115 బస్సులు అనుభవజ్ఞులైన మరియు సుశిక్షితులైన 230 మంది డ్రైవర్లు 170 మల్లీ ఇతర ఉద్యోగులను కేటాయించడం జరిగింది. చార్జీలో పెద్దలకు 400 పిల్లలకు 230గా ఉంటుంది అని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రనికి చెందిన మహిళలు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు ఆధార్ కార్డు ఓటర్ ఐడి కార్డు మొదలగునవి. చూపించి మహాలక్ష్మి ఉచిత టికెట్ పొంది ఈ జాతర స్పెషల్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చును అని తెలిపారు. ఆర్టీసీ జాతర స్పెషల్ బస్సులు మాత్రం సమ్మక్క సారాలమ్మ గద్దెలకు దగ్గరగా వెళతాయని కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని సురక్షితమైన సుఖవంతమైన ప్రయాణం చేయగలరని తెలిపారు.అలాగే గోయిల్ వాడ జాతరకు కూడా 27/01/2026 మంగళవారం నుండి జాతరకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం జరిగింది.గోయిల్ వాడ జాతరకు పెద్దలకు 60/రూపాయలు పిల్లలకు 40/రూపాయలు గా ఉంటుంది అని తెలిపారు. ఈ జాతర స్పెషల్ బస్సులలో క్యాంపులో టికెట్లు ఇచ్చే బుకింగ్ బూతులలో యూపిఐ. ఫోన్ పే గూగుల్ పే లాంటి డిజిటల్ లావాదేవీలు కొన్ని సాంకేతిక కారణాల వలన అనుమతించడం లేదు. నగదు మాత్రమే స్వీకరించబడుతుంది అని గోదావరిఖని డిపో మేనేజర్ యం. నాగభూషణం తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9441335701 గల ఫోన్ నెంబర్ ని సంప్రదిచాలని కోరారు.



# యశోద హాస్పిటల్ లో రక్త రుగ్మతలకు చికిత్స



**ఖమ్మం, విశాలభారతి:** ఖమ్మం ప్రాంతానికి చెందిన ఆరు సంవత్సరాల బాబు ప్రతినెల రక్తస్రావం అవుతూ ప్లేట్లెట్స్ పడిపోయి ఇబ్బంది పడుతున్న సమయంలో తల్లిదండ్రులు సోమాజిగూడ యశోద హాస్పిటల్ ను సంప్రదించగా అక్కడున్న వైద్య బృందం వెంటనే బోన్ మ్యారో పరీక్షలు నిర్వహించగా అప్లాస్టిక్ అనీమియ గా నిర్ధారించడం జరిగిందని దీనికి ఆల్లో జెనిక్ బోన్ మారో ట్రాన్స్ప్లాంటేషన్ విజయవంతంగా నిర్వహించాము అని సంవత్సరం తర్వాత తన ఆరోగ్యం నిలకడగా ఉందని సోమాజిగూడ యశోద హాస్పిటల్ డాక్టర్ అశోక్ కుమార్ (హేమాటలజీ & బి.యం.టి ) ఖమ్మంలో జరిగిన యశోద మెడికల్ సెంటర్ సమావేశంలో తెలియజేశారు . హేమటాలజీ , బోన్ మరో ట్రాన్స్ ప్లాంట్ , లుకేమియా , లింఫోమా , మల్టీపుల్ మైలోమ , అప్లాస్టిక్ అనీమియా , తల సేమియా , సికిల్ సెల్ డిసెస్ వంటి రక్త రుగ్మతలకు పెద్దలకు , పిల్లలకు సమగ్ర చికిత్స అందుబాటులో ఉందని పేర్కొన్నారు . ఇప్పటి వరకు 450 పైగా బోన్ మారో ట్రాన్స్ప్లాంటేషన్లు విజయవంతం చేసామన్నారు . దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి హెమటాలజీ సేవలను అందించడమే లక్ష్యంగా యశోద హాస్పిటల్స్ ముందుకు సాగుతుందని తెలిపారు . ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ ప్రతినెల నాలుగో మంగళవారం హేమ అంకాలజీ డాక్టర్ అందుబాటులో ఉంటారని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ కుమార్ మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు .

# ఎల్టా ఒలింపియాడ్ జూనియర్స్ విభాగంలో వై. రక్షిత సత్తా



**విశాలభారతి, అంతర్గం:** పెద్దపల్లి జిల్లా, అంతర్గం మండలం, లింగాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ లింగాపూర్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని వై. రక్షిత రాష్ట్ర స్థాయి ఎల్టా ఒలింపియాడ్ జూనియర్స్ విభాగంలో రెండవ బహుమతి సాధించడం పాఠశాలకు అత్యంత గర్వకారణం. ఈ సందర్భంగా విద్యార్థిని వై. రక్షితను పాఠశాల ప్రిన్సిపాల్ యఫ్ఏసి పి. సదానందం, ఉపాధ్యాయ బృందంతో కలిసి హృదయపూర్వకంగా అభినందించారు. ఆమె ఈ విజయం సాధించడంలో చూపిన పట్టుదల, కృషి మరియు ఉపాధ్యాయుల మార్గదర్శనం ప్రశంసనీయం అని తెలిపారు.ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ మోడల్ స్కూల్ నిరంతరం కృషి చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# వెంకటాపూర్‌లో శివ మహా పడిపూజ



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. శనివారం వెంకటాపూర్‌లో శివ స్వాములు వినోద్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో ప్రశాంతంగా ముగిసింది.

# యూనిఫామ్ క్రీడ సామాగ్రి పంపిణీ




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో యూనిఫామ్ ను క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. మడికొండ కాజిపేట్ సంబంధిత కీర్తిశేషులు శౌడ. శ్రీమతి పిన్నమ్మ లక్ష్మయ్య గార్ల జ్ఞాపకార్థంగా, వారి మనవళ్ళు చౌడ శ్యామ్, శ్రీనివాసు లు 40 వెయ్యిల విలువైన క్రీడా వస్తువులు, పాఠశాల యూనిఫాంను విద్యార్థులకు బహుకరించారు. ఈ సేవ కార్యక్రమం పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు సుమతి.మంగు, ప్రవీణ గార్ల బంధువులైన ఈ కుటుంబ సభ్యుల సహకారంతో, నిర్వహించబడింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి సుచిత్ర ఆనంద్ తో పాటు ఉపాధ్యాయులు నిరంజని, శారద, శ్రీదేవి, సునీత, ఎల్లయ్య, రంజిత్ తదితరులు పాల్గొని దాతలను ఆత్మ అభిమానం, ఆనందోత్సాహాలతో పూలదండలతో శాలువాలతో సత్కరించారు. విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, వారు అభినందనలు తెలుపుతూ,ఈ సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# అడ్డగూడూరులో వివిధ కార్యక్రమాలు

**విశాలభారతి, అడ్డగూడూరు:** వయోవృద్ధుల పోషణ సౌంరక్షణ అనే టాపిక్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి యం మధు టెన్త్ క్లాస్, రెండవ బహుమతి జి ధనశ్రీ నైన్త్ క్లాస్, మూడో బహుమతి, ఎండి అమీనా నైన్త్ క్లాస్ గెలుచుకున్నారు .గెలిచిన వారికి డిక్షనరీస్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ సబిత ఎంఈఓ. పి వెంకటాద్రి హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఇన్చార్జితో డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ, పోలీస్ స్టేషన్లో ఎస్ఐతో డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారుకార్యక్రమాల్లో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షులు కానుగుల రాము సెక్రటరీ బైరెడ్డి రామిరెడ్డి ఉపాధ్యక్షులు జక్కుల యాదగిరి ఇతరులు పాల్గొన్నారు.

# ఉల్లాసభరితంగా రెండో రోజు క్రీడలు




### ప్రారంభించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్

**పాల్వంచ, విశాలభారతి:** మండల పరిధిలోని కిన్నెరసాని క్రీడా మైదానంలో గిరిజన సంక్షేమ శాఖ ఐటిడిఎ భద్రాచలం , ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండవ రోజు క్రీడా పోటీలను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో బిజి బిజి గా ఉంటూ గిరిజన విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం కోసం ఈ క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు ఆడిన ఆటలు అందరిని ఆకర్షించాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనేది నేడు జరిగిన ఆటలే నిదర్శనం అని అన్నారు. అందరితో కలిసి ఆటవిడుపుగా సరదాగా ఆడటం మనసుకు చాలా ఉల్లాసం కలిగిందని, ఉద్యోగులు ఉపాధ్యాయులు అందరూ కలిసి వారికి నచ్చిన క్రీడలలో పాల్గొని ప్రతి ఒక్కరు గెలవాలని తపనతోనే ఆడారని అన్నారు. ఏ పి ఓ జనరల్ డేవిడ్ రాజ్,ఐటిడిఏ భద్రాచలం డిప్యూట్ డైరెక్టర్ అశోక్ క్రీడాకారులను ఉత్సాహపరిచారని,మానసిక శారీరక ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం కొరకు ఈ క్రీడలు నిర్వహించడం జరిగిందని అన్నారు.ఐటిడిఏ పిఓ గా బాధ్యతలు చేపట్టిన నుండి గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసం మెరుగుపడడానికి ఎన్నో రకాల ప్రణాళికలు తయారుచేసి వారి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నానని, జాతీయస్థాయిలో గిరిజన విద్యార్థులు క్రీడలలో రాణించడానికి నా వంతు సహకారం అందిస్తున్నానని ఆయన అన్నారు.మహిళలో ప్రథమ బహుమతి దమ్ముపేట బి టీం, ద్వితీయ బహుమతి ఏ టీం.టెన్నికాయిట్ లో ప్రథమ బహుమతి భద్రాచలం బీ టీం పురుషులు, ద్వితీయ బహుమతి ఖమ్మం బి టీం,50 మీటర్స్ రన్ పురుషులు మొదటి స్థానం దశరథ్, రెండవ బి సేన ఖమ్మం,3వ స్థానం, రాకేష్ సాధించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం డిడి విజయలక్ష్మి, భద్రాద్రి మరియు ఖమ్మం ఏసిఎంఓ లు రాములు, కె.రమేష్, దమ్మపేట ఏటీడీవో చంద్ర మోహన్,ఇల్లందు భారతి దేవి, వైరా పి రమేష్,ఖమ్మం సత్యవతి, స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాలరావు, మరియు సహచర ఏ ఎస్ ఓ లు కె.వెంకట్ నారాయణ, ఎస్ నాగేశ్వరరావు పి జి హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, పిడి, పీఈటీలు పాల్గొన్నారు

## సీఎం కప్ క్రీడా పోటీల్లో యువత పాల్గొనాలి

**ఎంపీడీవో సంధ్య**



**మొయినాబాద్, విశాలభారతి:** సీఎం కప్ క్రీడా పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎంపీడీవో సంధ్య పిలుపునిచ్చారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంధ్య అధ్యక్షతన సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పంచాయితీ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి మల్లయ్య, మొయినాబాద్ ఎస్సై జబీనా బేగం, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంధ్య మాట్లాడుతూ, క్రీడాకారులు సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిల్కూర్ రెసిడెన్షియల్ మైదానంలో ఈనెల 29, 30 తేదీలలో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్ వంటి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని క్రీడాకారులు కూడా నేరుగా మైదానంలో హాజరై పోటీల్లో పాల్గొనవచ్చని ఎంపీడీవో సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువతే దేశ బలం... క్రీడలే మార్గం

**కుంట్లూర్లో ఘనంగా ప్రధాని సంసద్ క్రీడా మహోత్సవం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కుంట్లూర్ గ్రామం ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవానికి వేదికైంది. గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. లక్ష్మణ్ మాట్లాడుతూ.. యువతే దేశానికి అసలైన బలమని, ఆ యువతను సరైన దిశలో నడిపించే శక్తి క్రీడలకే ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు తగిన ప్రోత్సాహం లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు తయారవుతారని తెలిపారు. ఇలాంటి క్రీడా మహోత్సవాలు యువతను చెడు అలవాట్లకు దూరం చేసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుతాయని పేర్కొన్నారు.అనంతరం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ క్రీడా మహోత్సవంలో భాగంగా పలు గ్రామాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, స్థానిక నాయకులు, యువత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**మృతుని కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ కాంగ్రెస్ పార్టీ**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి నక్కర్తలో కందడి నరసింహ ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి అండగా ఉండాలన్న సంకల్పంతో ఆర్థికంగా చేయూతనిచ్చేలా గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చింది. మృతుడి కుటుంబానికి భవిష్యత్తులో ఆదరణగా, అండగా ఉండేలా నాయకులు, కార్యకర్తలు రూ. ఒక లక్ష పోగు చేశారు. పోగైన మొత్తాన్ని సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ఉప సర్పంచ్ మధుకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం, మాజీ సర్పంచ్ ఎరుకలి బాలరాజ్ గౌడ్, చిగురంత సికిందర్ రెడ్డి, ఏవిజి ఫౌండేషన్ చైర్మన్ ఆడాల గణేష్ చేతుల మీదుగా మృతుడి కుటుంబం తరపున పెద్ద కురుమ కలకొండ బీరప్పకు అందజేశారు. భవిష్యత్తులో కూడా మృతుడి కుటుంబానికి అండగా ఉంటూ తమ వంతు సహకారం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు జమ్మ గుండాలు, వార్డు సభ్యులు మక్కపల్లి మహేష్, ముచ్చర్ల ప్రకాష్, బన్నే జంగయ్య, బేత జంగయ్య, గడ్డం మల్లేష్, కలకొండ మల్లేష్, బండ రాజు, ఏరకలి కృష్ణ, జమ్మ శివ,మొరుగు మహేష్, బండ బీరప్ప, పోలే జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



**కేశంపేట, విశాలభారతి:** మహిళల ఆర్థిక అభ్యున్నతికి,సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మంగలిగూడెం గ్రామ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి అన్నారు. 10 లక్షలతో నిర్మించ తలపెట్టిన మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని, అందులో భాగంగా ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందన్నారు.మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలకు శాశ్వత వేదిక ఉండేలా భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అందులో భాగంగా గ్రామానికి మంజూరైన మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ యెషమోనీ రాధాకృష్ణ, వార్డ్ సభ్యులు సుధాకర్,శ్రీలత,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## భర్త మృతి చెందగా తల్లికి పిల్లలు దూరం!

**అత్తవారింటి ముందు మహిళ ధర్నా**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్‌నగర్ పద్మాలయ కాలనీలో చోటుచేసుకున్న ఓ ఘటన మానవీయ విలువలను ప్రశ్నార్థకంగా మార్చింది. కుటుంబ కలహాల కారణంగా భర్తకు, పిల్లలకు దూరంగా తల్లిదండ్రుల వద్ద నివసిస్తున్న ముడుపు సుష్మా అనే మహిళ జీవితంలో అనూహ్య విషాదం చోటుచేసుకుంది. కొన్ని రోజుల క్రితం ఆమె భర్త ముడుపు ప్రవీణ్ రెడ్డి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం ఆమెను తీవ్ర వేదనకు గురిచేసింది.భర్త మృతి చెందిన విషయం తెలుసుకున్న సుష్మా అత్తవారింటికి వెళ్లగా, ఆమెను ఇంట్లోకి రావద్దని అత్తమామలు అడ్డుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.అంతేకాకుండా తన చిన్నారులను తనతో పాటు పంపించాలని ఆమె కోరినా, అత్తమామలు నిరాకరించడంతో ఆమె దిక్కుతోచని స్థితిలో అత్తవారింటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది.బాధిత మహిళ పరిస్థితి తెలుసుకున్న దిశా మహిళా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిర ఆధ్వర్యంలో మహిళా సంఘాల నాయకులు సంఘటితమై సుష్మాకు మద్దతుగా నిలిచారు. తల్లికి పిల్లలను దూరం చేయడం అన్యాయమని, బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారు ధర్నాకు దిగారు. మహిళలపై జరుగుతున్న ఇలాంటి ఘటనలను సహించబోమని, అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మహిళా సంఘాల నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దిశా మహిళా సేవా సమితి సభ్యులు బాధితురాలు తల్లి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఆకట్టుకున్న మాదిరి పోలింగ్



**ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కురుమిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన మాదిరి పోలింగ్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థి దశ నుండి విద్యార్థులకు రాజకీయ నైపుణ్యం ఎన్నికల నిర్వహణ నామినేషన్ ఓటు హక్కు వినియోగించుకోవడం తదితర అంశాలతో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తు పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతోపాటు, సాంస్కృతిక , రాజకీయ వ్యవస్థలపై అవగాహన ఉండేందుకు మాదిరి పోలింగ్ నిర్వహించామని తెలిపారు. ఓటు వేసే ప్రక్రియ గురించి తెలుసుకోవడానికి మాదిరి పోలింగ్ అవసరం ఉందన్నారు. విద్యార్థులు వరుసలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకోవడం వలన వారిలో క్రమశిక్షణ పెరుగుతాయని అన్నారు. ఓటు యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవడం వలన భవిష్యత్తులో బాధ్యత గల పౌరులుగా తయారు అవుతారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, రాణి, శ్రీనివాస్, అశోక్, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క జాతరకు పటిష్టమైన బందోబస్త్



- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వొద్దు
- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

**విశాలభారతి, గోదావరిఖని:**

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో సమ్మక్కసారలమ్మ జాతర లలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. శనివారం సాయంత్రం గోదావరి బ్రిడ్జ్ వద్ద సమ్మక్క, సారలమ్మ జాతర ప్రదేశాలని పోలీస్ అధికారులతో సందర్శించారు. జాతర పరిసరాలు, ప్రాంగణం అంతా ఆయన తిరిగి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ జాతర విశేషాలను స్థానికులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భక్తుల భద్రత రక్షణ చర్యలతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. జాతరకు ఎంత మంది భక్తులు వచ్చేది అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతరప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీకెట్స్ నీ చెక్ చేయాలనీ నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది కావున ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాటిని మరొక సారి తనిఖీ చేయాలనీ సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు, భక్తులు, ముఖ్యంగా మహిళల భద్రత, రక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసుల సూచనలు పాటించాలని అన్నారు. జాతర సందర్భంగా వాహనాలను పోలీసులు నిర్ణయించిన స్థలాల్లో పార్కింగ్ చేయాలని సూచించారు. సీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రాసేనా రెడ్డి, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ భీమేష్, కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, టెంపుల్ ఏ ఓ కాంతరెడ్డి, ఫౌండేషన్ బంగారి రాజయ్య, సింగరేణి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 2 నుంచి మిర్చి కొనుగోళ్లు ప్రారంభం

**మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్**

**మహబూబాబాద్, విశాలభారతి:**



మానుకోట వ్యవసాయ మార్కెట్లో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి మిర్చి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్లో మిర్చి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ మాట్లాడుతూ, ప్రస్తుతం మేడారం మహాజాతర కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు పెద్ద సంఖ్యలో జాతరకు వెళ్లుతున్నారని, అందువల్ల ఇప్పుడే కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలగదని వివరించారు. జాతర అనంతరం రైతులు పంటను మార్కెట్‌కు తీసుకువస్తారని అంచనా వేసి ఫిబ్రవరి 2 నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించామని చెప్పారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, మిర్చికి న్యాయమైన ధర లభించేలా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. మార్కెట్‌లో తూకం, లావాదేవీలు, చెల్లింపులు అన్నీ క్రమబద్ధంగా జరగేలా అధికారులకు, వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. వ్యాపారులు కూడా రైతులకు సహకరించాలని, ధరల విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుల శ్రమకు తగిన విలువ దక్కాలన్నదే పాలకమండలి ప్రధాన లక్ష్యమని ఇస్లావత్ సుధాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, మార్కెట్ కార్యదర్శి సుజన్‌బాబు, సూపర్‌వైజర్ రమేష్, మిర్చి వ్యాపారులు దీపక్, విజయ్, ఆకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జీ–రామ్–జీ ఉపాధి చట్టం రద్దు చేయాలి

- లక్ష్మీపురం (బి) గ్రామసభ తీర్మానం
- కేంద్ర ప్రభుత్వ విధానాలతో గ్రామీణ కూలీలకు అన్యాయం
- రద్దు కోరుతూ లక్ష్మీపురం (బి)లో మెమోరాండం

**మహబూబాబాద్ విశాలభారతి:** ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న జీ-రామ్-జీ ఉపాధి చట్టాన్ని వెంటనే రద్దు చేసి, పాత ఎంజి ఎన్ఆర్ఈజీఏ, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ లక్ష్మీపురం (బి) గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. పాలకమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు సంయుక్తంగా మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మహమ్మద్ జానిమియా, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చల్ల వెంకన్న, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు చారి హరీష్ మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాత ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచి కొత్త చట్టం తీసుకురావడం ద్వారా ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విత్తన చట్ట సవరణ బిల్లు, కేంద్ర విద్యుత్ బిల్లులను కూడా వెంటనే రద్దు చేయాలని గ్రామసభ ద్వారా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ కార్యక్రమంలో తుర్కా శ్రీనివాస్, మహమ్మద్ అసిఫ్, తెల్లబోయిన సాయి కుమార్, చారి నాగరాజు, ముద్దంగుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## గణతంత్ర వేడుకలకు ముస్తాబైన మర్పల్లి

**ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ శోభ**

**మర్పల్లి, విశాలభారతి:** భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మర్పల్లి మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం జరగనున్న ఈ వేడుకల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు విద్యుత్ దీపాలు, రంగురంగుల ముగ్గులతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కలకలలాడుతున్న కార్యాలయాలు మర్పల్లి మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ మరియు గ్రామ పంచాయతీ భవనాలను జాతీయ జెండా రంగులను ప్రతిబింబించేలా అలంకరించారు. శనివారం సాయంత్రానికే అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.స్థానిక మండల పరిషత్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు మరియు ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనల కోసం సిద్ధమయ్యారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడానికి ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మర్పల్లి పోలీసులు మండల వ్యాప్తంగా నిఘా పెంచారు. ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం గ్రామానికి కుర్చీల వితరణ

**మన్నే సంగమేశ్వర్ ఉదారత**



**మర్పల్లి, విశాలభారతి:** కన్నవారి జ్ఞాపకాలు ఎప్పటికీ సజీవంగా ఉండాలని, అవి పదిమందికి ఉపయోగపడాలని మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మన్నే సంగమేశ్వర్ ఆదర్శంగా నిలిచారు. ఇటీవల మరణించిన తన తండ్రి కీ.శే. మన్నే మొగులయ్య గారి జ్ఞాపకార్థం, గ్రామంలోని ప్రజల సౌకర్యార్థం ఆయన వినూత్న సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తులు, ప్రయాణికులు ఎక్కువగా ఉండే ప్రధాన కూడలి లో కూర్చోవడానికి వీలుగా 11 కుర్చీలను సంగమేశ్వర్ ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కుర్చీలను గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మన్నె పాండు మాట్లాడుతూ.. "సాధారణంగా తండ్రి మరణానంతరం కేవలం కర్మకాండలకే పరిమితం కాకుండా, ఊరి ప్రయోజనం కోసం ఇలాంటి పనులు చేయడం అభినందనీయం. మెయిన్ సెంటర్‌లో బస్సు కోసం వేచి చూసే ప్రయాణికులకు, వృద్ధులకు ఈ కుర్చీలు ఎంతో ఉపయోగపడతాయి" అని కొనియాడారు. సొంత ఖర్చుతో గ్రామాభివృద్ధికి సహకరించిన మన్నే సంగమేశ్వర్‌ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్‌గా రాజేశ్వరరావు



**అశ్వాపురం, విశాలభారతి:** మండల డిప్యూటీ తహసిల్దారుగా మైపతి రాజేశ్వరరావు శనివారం బాధితులు చేపట్టారు. గతంలో ఈయన ఆర్ఐ, యు డి సిగా కొన్నిలుగా పనిచేశారు. ఇటీవల డిప్యూటీ తహసిల్దార్గా పదోన్నతి పొందిన తరువాత మణుగూరులోమండలంలో కొంతకాలం పని చేశారు. మరల అశ్వాపురం మండలానికి బదిలీగా వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి
- పట్టణ ప్రణాళిక ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి



**ముషీరాబాద్, విశాలభారతి:** పంట పొలాలలో ఎరువులు (కెమికల్స్) వినియోగం ఎక్కువైందని పట్టణ ప్రణాళిక ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. దీనితో సారవంతం లేకుండా వ్యవసాయ భూములు పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూముల్లో సారం ఏర్పడాలంటే సేంద్రియ ఎరువులను వాడాలని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అసోసియేషన్ చైర్మన్ బి కృపాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి చిన్నారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండ రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో రిటైర్డ్ అయినప్పటికీ ప్రభుత్వానికి సపోర్టుగా రైతుల అభ్యున్నతికి పనిచేయడం అభినందనీయమన్నారు. పంటలకు అత్యధికంగా కెమికల్స్ ఎరువులు అధికంగా వాడడం వల్ల భూములు పాడైపోతున్నాయని, అంతేకాకుండా పెట్టుబడి ఎక్కువై రైతులకు వ్యవసాయం లాభసాటిగా లేకుండా పోతుందన్నారు. వరి పత్తి కే రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఇతర పంటల వైపు చూడడం చూడడం లేదని చెప్పారు. గతంలో ఆముదం రైతులు బాగా వేసేవారని ఇప్పుడు ఆ పంట కనబడడం లేదని,ఇలా చాలా పంటలు నేడు కనుమరుగు అయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గోపాల్ రెడ్డి తో పాటు రిటైర్డ్ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్డీ క్రీడోత్సవాలను ప్రారంభించిన ఎంఈఓ సబిత



విశాలభారతి, అడ్డ గూడూర్: మండల కేంద్రంలో క్రీస్తు శేషులు కత్తుల లింగరాజు యాదవ్ జ్ఞాపకార్థకంగా తనతో పాటు చదువుకున్న 2016 17 ఎస్ఎస్సి బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ద్వితీయ కబడ్డీ క్రీడోత్సవాలను అడ్డగూడూరు ఎంఈఓ సబిత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 24 నుండి 26 వరకు కబడ్డీ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు సర్పంచ్ వనజ సైదులు, ఎంపీ ఓ ప్రేమలత, ఉప సర్పంచ్ వరిగడ్డి లోకేష్, బైరెడ్డి సందీప్ రెడ్డి, కడారి రమేష్, గజ్జల్లి రవి ,షేక్ సమీర్, పయ్యావుల రమేష్, దాసరి బాలరాజ్,గుజ్జ మత్యగిరి, మహేష్, భరత్, కబడ్డీ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైయినేజీ పనులతో శాశ్వత పరిష్కారం

**జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**




**ఎల్బీనగర్, విశాలభారతి:** మన్సూరాబాద్ డివిజన్, వివేకానంద నగర్ కాలనీ ఫేస్-2 లో 65.00 లక్ష లతో చేపట్టబోయే పనులతో భూగర్భ డ్రైయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా పునరుద్ధరణ పనులను హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్బీ జీఎం మహేందర్ నాయక్, స్థానిక కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి జీహెచ్ఎం సీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా పైపు లైన్ లెవెల్స్ సరిగా లేక తరచూ మురుగు నీరు రోడ్ల పై పొంగిపొర్లి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించేదని, ఇప్పుడు నూతనంగా లైన్ వేయడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. పరిశుభ్రమైన కాలనీ, ఆరోగ్యకరమైన వాతావరణం దిశగా తీసుకున్న ఈ ముందడుగుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, లక్ష్మారెడ్డి, హెచ్ఎండబ్ల్యూ ఎస్, ఎస్బీ మేనేజర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్య భవిష్యత్తుకు పునాది

**విద్యార్థులకు టైలు, బ్యాడ్జీలు, బెల్టులు పంపిణీ**




**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ప్రాథమిక విద్యతోనే భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుందని మేడిపల్లి నక్కర్ తో సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి నక్కర్తలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ విద్యార్థులకు టైలు, బ్యాడ్జీలు, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ సంపత్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నతంగా చదివి సామాజికంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. విద్యార్థులు ఉన్న తంగా పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థుల కోసం ఏ అవసరం వచ్చిన తన దృష్టికి తీసుకొస్తే సహకారం అందించడంలో ముందుంటామన్నారు. ప్రాథమిక విద్య ప్రగతికి నాంది అని ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నతంగా చదవాలని కోరారు. ఉప సర్పంచ్ మధుకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్రాజ్ గౌడ్, ఏవిజి ఫౌండేషన్ చైర్మన్ ఆదాల గణేష్, జంగారెడ్డి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుల కష్టార్జితాన్ని దోచిన పీఏసీఎస్ నిర్వాహకుడు

- **బినామీ అకౌంట్లలో లక్షల రూపాయలు.**
- **పెద్ద ఎల్లాపూర్ కు కేంద్రం తరలించి అమాయక రైతులను మోసం**
- **రైతుల సొమ్ము కాజేస్తున్న పీఏసీఎస్**
- **గంగారం మండలంలో పీఏసీఎస్ నిర్వాహకుని ఇష్టారాజ్యం**
- **గ్రాస్ క్వాంటిటీ పేరుతో రైతులకు భారీ మోసం**
- **రైతులకు చిట్టీ కూడా ఇవ్వకుండా పంపకం**
- **పెద్ద ఎల్లాపూర్‌కు తరలించిన కొనుగోలు కేంద్రం**
- **అమాయక రైతులపై బెదిరింపులు.**
- **కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత రైతులు**
- **గుండగాని శ్రీనుపై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్**



**గంగారం, విశాలభారతి:** ఆరుగాలం కష్టించి పండించే రైతన్న దేశానికి వెన్నెముక అని చెప్పుకునే ప్రభుత్వ వ్యవస్థలోనే రైతుల కష్టార్జితాన్ని దోచుకునే ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గంగారం మండలంలో పీఏసీఎస్ అధికారులు, ఓ ప్రయివేట్ వ్యక్తి గుండగాని శ్రీను కుమ్మక్కై రైతులను మోసం చేస్తూ బినామీ పేర్లతో మొక్కజొన్నలు కొనుగోలు చేసి లక్షల రూపాయలు దండుకున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దళారుల చేతిలో రైతులు మోసపోకుండా పీఏసీఎస్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ కేంద్రాలను కొందరు నిర్వాహకులు తమ లాభాల కోసం ఉపయోగించుకుంటూ రైతులపై గ్రాస్ క్వాంటిటీ అనే నెపంతో మోసాలకు పాల్పడుతున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు.

**150 లారీలు తరలింపు..., చిట్టీ ఇవ్వకుండా పంపించేశారు**

బాధిత రైతుల వివరాల ప్రకారం... గంగారం మండలంలోని మర్రిగూడెం పీఏసీఎస్ పరిధిలో నిర్వహించాల్సిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని పెద్ద ఎల్లాపూర్ గ్రామానికి తరలించారు. అక్కడకు వచ్చిన రైతుల మక్కలను కాంటా వేసి, ఒక్క చిట్టీ కూడా ఇవ్వకుండా “మీ డబ్బులు మీకు వస్తాయి... వెళ్ళండి” అంటూ పంపించారని తెలిపారు. అంతేకాకుండా ఎవరైనా రైతులు గట్టిగా అడిగితే... “మీ జొన్నలు మంచిగా లేవు..., లోడ్ చేయించలేం..., తీసుకెళ్లండి” అంటూ బెదిరింపులకు గురి చేశారని బాధితులు వాపోయారు. బయట మార్కెట్‌లో రేటు లేకపోవడంతో రైతులు చేసేదేమీ లేక నిర్వాహకులు చెప్పిందే విని వెళ్లిపోయారని పేర్కొన్నారు.

**గ్రాస్ క్వాంటిటీ పేరుతో బినామీ అకౌంట్లకు డబ్బులు!**

ఈ కేంద్రం ద్వారా కనీసం 150 లారీలు మొక్కజొన్నలు లోడ్ చేసి తరలించినట్లు రైతులు తెలిపారు. ప్రతి లారీలో గ్రాస్ క్వాంటిటీ ఎక్కువగా ఉందని చూపించి, ఆ అదనపు బస్తాలను బినామీ పేర్లతో నమోదు చేసి డబ్బులు తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు ఆరోపించారు. దీంతో అసలు రైతులకు రావాల్సిన సొమ్ము బినామీ అకౌంట్లలో జమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు..., విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. ఈ దోపిడీపై కొందరు ఆదివాసీ రైతులు ముందుకు వచ్చి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు ఈసం దూలయ్య, పుల్సం చంద్రయ్య, మద్దెల రమేశ్, ఈసం సాంబ లక్ష్మి మాట్లాడుతూ..., మర్రిగూడెం పీఏసీఎస్ కేంద్రాన్ని పెద్ద ఎల్లాపూర్‌కు తరలించి రైతులను మోసం చేసిన గుండగాని శ్రీనుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి బస్తా 51.700 కిలోలు ఉండాలని ప్రచారం చేసి, అదే మాటను అడ్డం పెట్టుకుని రైతుల మక్కలను తరలించి బినామీ పేర్లతో డబ్బులు వేయించుకున్నారని ఆరోపించారు. బినామీ పేర్లతో ఉన్న అకౌంట్లను జప్తు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. రైతులను మోసం చేసిన కొనుగోలు కేంద్ర నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. బినామీ పేర్లతో వివిధ లారీల్లో మక్కల బస్తాలు తరలించిన వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధిత రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు, అన్ని అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాలు, మండల కార్యాలయాలు మరియు పోలింగ్ బూత్ స్థాయిలో నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు, యువతతో భారీ ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి కార్యాలయంలో మరియు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని, ఇటీవల కొత్తగా ఓటరుగా నమోదైన యువతకు ఈ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఈ వేడుకల్లో ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# ఒక్క క్లిక్‌తో 24 గంటల్లో మీ ముందుకు ఇసుక లోడ్..!

**ఖమ్మం బ్యూరో, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రంలో ఇసుక విక్రయాల్లో పారదర్శకత పెంచడానికి.. అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం వినూత్న మార్పులు చేస్తోంది. ఇసుక మాఫియా ఆగడాలకు చెక్ పెడుతూ.. సామాన్యులకు తక్కువ ధరకే ఇసుకను చేరవేయడమే లక్ష్యంగా ‘ మన ఇసుక వాహనం ’ అనే నూతన ఆన్‌లైన్ విధానాన్ని ప్రభుత్వం సిద్ధం చేసింది. దీని ద్వారా వినియోగదారులు నేరుగా మొబైల్ యాప్ సహాయంతో తమకు కావాల్సిన ఇసుకను బుక్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్ ద్వారా కూడా మీరు ఇసుకను బుక్ చేసుకోవచ్చు. ఈ నూతన విధానాన్ని ప్రాథమికంగా *కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈ జిల్లాల్లో లభించే ఫలితాలను బట్టి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను విస్తరించనున్నారు. వినియోగదారులు ‘మన ఇసుక వాహనం ’ యాప్ డౌన్ లోడ్ చేసుకుని తమ వివరాలు నమోదు చేయాలి.



ఒకవేళ స్మార్ట్ ఫోన్ లేని పక్షంలో.. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి కూడా ఇసుకను బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న 24 గంటల్లోపు వినియోగదారుడి ఇంటి వద్దకే ఇసుకను సరఫరా చేస్తారు. ఇసుక లోడ్‌తో బయలుదేరిన ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాన్ని అమర్చుతారు. దీనివల్ల వాహనం ఏ మార్గంలో వెళుతోంది..? ఎక్కడ ఆగుతోంది అనే వివరాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించవచ్చు. నేరుగా ప్రభుత్వ పోర్టల్ ద్వారా బుకింగ్ జరగడం వల్ల మధ్య వర్తుల ప్రమేయం ఉండదు. దూరాన్ని బట్టి ధరలను నిర్ణయించడం వల్ల వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడదు. అక్రమ మార్గాల్లో తరలిపోతున్న ఇసుక సొమ్ము నేరుగా ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. గత ఏడాది రూ. 738 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది అది రూ. 1,000 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి *రెవెన్యూ, పోలీస్, రవాణా, మైనింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో 2017లో పెద్దపల్లి జిల్లాలో ‘స్యాండ్ టాక్సీ ’ పేరుతో ఇలాంటి విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ.. కొన్ని కారణాల వల్ల అది నిలిచిపోయింది. కానీ ఇప్పుడు టెక్నాలజీని జోడించి మరింత పకడ్బందీగా దీనిని అమలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు, ఆర్డీవోలు అక్రమ రవాణాను అడ్డుకోవడంలో విఫలమైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా ఇసుక అవసరం ఉన్న పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరగనుంది.

## పాల్వంచ బిడ్డ.. ప్రపంచ వేదికపై గర్జన




- **దావోస్‌లో డాక్టర్ మధుసూదన్ రెడ్డి సరికొత్త చరిత్ర**
- **ప్రపంచ ఆర్థిక సదస్సులో దాదాపు రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడులు**

**పాల్వంచ, విశాలభారతి:**

తెలంగాణలోని మారుమూల ప్రాంతమైన పాల్వంచలో ఒక సాధారణ ఉపాధ్యాయునిగా,విద్యావేత్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఒక వ్యక్తి, నేడు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) పై దేశం గర్వించేలా అద్భుతాలు సృష్టిస్తున్నారు. విలిన్ బయో మెడ్ లిమిటెడ్ (విలిన్ బిఓ మెడ్ లిమిటెడ్) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి యదమకంటి, స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న 56వ ప్రపంచ ఆర్థిక సదస్సులో దాదాపు రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడుల ఒప్పందాలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఎల్ఆర్ సంస్థల నుంచి దావోస్ వరకు. డాక్టర్ మధుసూదన్ రెడ్డి ప్రస్థానం పాల్వంచలోని ప్రసిద్ధ కేఎల్ఆర్ విద్యా సంస్థల నుంచి ప్రారంభమైందని.తన మామగారు, దివంగత డాక్టర్ కె. లక్ష్మారెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఆ సంస్థల సెక్రటరీగా ఆయన ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని అన్నారు పాల్వంచలోని ఆ మట్టిలో నేర్చుకున్న క్రమశిక్షణ, కార్యదక్షతే నేడు తనను ఈ స్థాయికి చేర్చాయని ఆయన గర్వంగా చెబుతుంటారు. "పాల్వంచలో కేఎల్ఆర్ సంస్థల సెక్రటరీగా నేను నేర్చుకున్న పాఠాలే నేడు దావోస్‌లోని ఈ గ్లోబల్ బోర్డ్‌రూమ్‌లలో నిర్ణయాలు తీసుకోవడానికి నాకు ధైర్యాన్ని ఇచ్చాయి" అని డాక్టర్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

**మహా రాష్ట్ర ప్రభుత్వంతో బారి ఒప్పందాలు**

స్విట్జర్లాండ్‌కు చెందిన 'స్కా గ్రూప్ ఏజీ'ద్వారా మహారాష్ట్ర ప్రభుత్వంతో డాక్టర్ రెడ్డి చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నారు.నాసిక్‌లో ఇంటిగ్రేటెడ్ ఫార్మా సిటీ: రూ. 2,100 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో ఎఫ్ డి ఐ నాసిక్‌లో భారీ ఫార్మా హబ్‌ను నిర్మిస్తున్నారు.ఉపాధి ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 4,850 మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.కీలక పాత్ర: ఈ భారీ ప్రాజెక్టులో విలిన్ బయో మెడ్ లిమిటెడ్ ప్రధాన భాగస్వామిగా వ్యవహరించనుంది.కేరళలో రూ. 100 కోట్ల మెడికల్ హబ్ మెడికల్ డివైజ్ తయారీ రంగంలో కేరళ ప్రభుత్వంతో డాక్టర్ రెడ్డి రూ. 100 కోట్ల ఒప్పందం చేసుకున్నారు. దీని ద్వారా మరో 200 మందికి ఉపాధి లభించనుంది. కేరళ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పి. రాజీవ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

**ఖతార్ ప్రభుత్వంతో చర్చలు**

అంతర్జాతీయ విస్తరణలో భాగంగా ఖతార్ దేశానికి చెందిన పెట్టుబడిదారులతో కూడా డాక్టర్ రెడ్డి చర్చలు జరిపారు. విలిన్ బయో మెడ్ సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు.పాల్వంచ గడ్డపై ఒక సామాన్య నేపథ్యం నుంచి మొదలై, నేడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ వంటి అగ్రనేతల సమక్షంలో భారీ ఒప్పందాలు కుదుర్చుకునే స్థాయికి ఎదిగిన డాక్టర్ మధుసూదన్ రెడ్డి ప్రస్థానం తెలుగు వారందరికీ స్ఫూర్తిదాయకం.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

**వనపర్తిలో యువజన కాంగ్రెస్ సమర శంఖారావం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రానున్న మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడమే లక్ష్యంగా వనపర్తి జిల్లాలో యువజన కాంగ్రెస్ శ్రేణులు సమరానికి సిద్ధమయ్యాయి. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య జిల్లా ఇంచార్జ్ సుకన్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ & వనపర్తి డీసీసీ అధ్యక్షులు శ్రీ శివసేన రెడ్డి, వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మేఘ రెడ్డి , రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్ , రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి హాజరై యువజన కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే ఓటు చోరీకి పాల్పడుతున్న బీజేపీ కుట్రలను, జాతీయ ఉపాధి హామీ చట్టంలో మహాత్మా గాంధీ పేరును మార్చే ప్రయత్నాలను ప్రజలకు వివరించి ఎదుర్కోవాలని సూచించారు.అంతేకాకుండా విత్ ఐ వై సి యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త డిజిటల్ వేదికల్ని సమర్థవంతంగా వినియోగించాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకాన్ని మరింత పెంచుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు మాజీద్, శివంత్ రెడ్డి, సామిడి చరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి 9వ వార్డులో ఆరోగ్య హామీ

**పెద్దపల్లి, విశాలభారతి,**

పెద్దపల్లి నగరంలోని 9వ వార్డు చీకురాయి రోడ్‌లో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.అడిచర్ల స్వతంత్ర కుమార్ ఆధ్వర్యంలో,లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు పూదరి దత్తాగౌడ్ సహకారంతో ,మెడికవర్ ఆసుపత్రి కరీంనగర్ వారి సౌజన్యంతో ఈ శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత నిర్ధారణ పరీక్షలు,బీ పీ,షుగర్,ఈసీజీ వంటి కీలక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.అలాగే నేత్ర వైద్య సహాయకులు బుద్దార్తి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేపట్టగా,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అడిచర్ల స్వతంత్ర కుమార్ మాట్లాడుతూ ,9వ వార్డులో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.కంటిలో పొరలు (కాటరాక్ట్) ఉన్నవారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు కూడా అందించనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి కరీంనగర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ గౌడ్,మార్కెటింగ్ మ్యానేజర్ కోట కరుణాకర్,టీం లీడర్ హరీష్,క్యాంప్ కో ఆర్డినేటర్ వేముల శ్రీకాంత్,డా.ప్రకాష్‌తో పాటు పలువురు వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.ప్రజారోగ్యంపై బాధ్యతతో ముందుకు సాగుతున్న ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

## బాలికల పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ తీసుకోవాలి

**జాతీయ బాలికల దినోత్సవం లో సిడిపిఓ**



**అశ్వాపురం, విశాలభారతి :** నేటి బాలికలే రేపటి దేశానికి దిక్సూచిలవుతారని వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ బూర్గంపాడు సిడిపిఓ రేవతి అన్నారు. శనివారం మండల పరిధిలోని సీతారామపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. దేశంలో నేడు బాలికల పట్ల జరుగుతున్న అవాంతరాలను ప్రతి ఒక్కరు ఎదుర్కోవాలన్నారు. ఆడపిల్లలను చిన్నచూపు చూసే ధోరణిని మానుకోవాలన్నారు. ఇంటికి లక్ష్మి ఆడపిల్లనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు పురుషులతో ఎక్కడ తీసుకున్నారు. నేడు దేశంలో బాలికల పాత్ర ఎంతగానో ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు ఉంటున్నారన్న విషయం ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. బాల్యవివాహాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించోద్దన్నారు. బాలిక చిన్నారులను అన్ని విధాల కాపాడే బాధ్యతను సమాజంలోని ప్రతి ఒక్కరు తీసుకుని వారికి రక్షణ వలయంగా నిలవాలని ఈ సందర్భంగా మా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరి, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ స్వప్న, సావిత్రి ధనలక్ష్మిఅంగన్వాడి టీచర్ విజయ విలాసం పాల్గొన్నారు.

## ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా వ్యాపారం నిర్వహించుకోవాలి

**మణుగూరు మునిసిపాలిటీ కమిషనర్ ప్రసాద్**




**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోనే ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారి భవనంలో రోడ్ల ఆక్రమణలు, కూరగాయల పాట కొట్లు, రోడ్డు పై వ్యాపారుల తాత్కాలిక ఆక్రమణల వల్ల కలుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందుల గురించి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, వ్యాపారులు, కూరగాల వ్యాపారుల సంఘం బాధ్యులు, చిరు వ్యాపారులు పాల్గొని తమ సాధక బాధకాలను అధికారులకు వివరించారు.ఈ కార్యక్రమం లో పట్టణ సి ఐ పాల్గొని వ్యాపారులకు పలు సూచనలు చేస్తూ ట్రాఫిక్ కి ఇబ్బంది కలిగించకుండా వ్యాపారం నిర్వహించుకోవాలని,లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు. కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పై ఆంక్షలు చెత్త సేకరణలో పౌరుల బాధ్యత, ట్రేడ్ లైసెన్స్ ల ఆవశ్యకతను వివరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటికాల భాస్కర్, షైనీ, మడకం మధు లు రోడ్లను, డ్రైన్స్ ను ఆక్రమించటం వలను వచ్చిన ఇబ్బందుల గురించి వివరించారు. అతిక్రమించిన వారికి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మాట్లాడుతూ తమ అసోసియేషన్ సభ్యులకు తగు సూచనలు చేస్తామని, సరిచేసుకోవడానికి 10 రోజుల సమయం కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మాధవి, వివిధ వ్యాపార సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## మార్గం పూజ,శివకృష్ణ ప్రజలకు సేవ చేసే వ్యక్తి

**చిలకల శ్రీనివాస్ యాదవ్ బిసీ జాక్ కన్వీనర్**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణకేంద్రంలోని 14 వార్డు సంబంధంచిన మార్గం పూజ,శివకృష్ణ యాదవ్ ను ఘనంగా సన్మానించి,మద్దతు పలికినా బహుజన,బిసి,యాదవ్ సంఘం నాయకులు బీసీ జాక్ రాష్ట్ర కన్వీనర్ చిలకల శ్రీనివాస్ యాదవ్,జాతీయ బీసీ నాయకుడు అంబర్‌పేట శ్రీనివాస్ యాదవ్.ఈ సందర్భముగా చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పూజ,శివకృష్ణ యాదవ్ ప్రజలకు అందుబాటులో సమాజ సేవలో ముందు ఉండి నమ్మిన ప్రజల కోసం నిరంతరం సేవ చేసే వ్యక్తి ఇలాంటి వ్యక్తికి బీజేపీ పార్టీ కచ్చితముగా టిక్కెట్టు ఇచ్చి గెలిపించుకోవాలని పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా ఒక ప్రకటనలు సూచించారు.ఈ కార్యక్రమములో భీమ్ బహుజన సంఘం చంద్రశేఖర్,యాదవ్ సంగం మండల కార్యదర్శి వెంకటేష్ యాదవ్,జింకల మారయ్య యాదవ్,ఉడుగు శ్రీశైలం గౌడ్,సర్వైల్ శ్రీనివాస్ పాలుగొన్నారు.

## కృష్ణవేణి, సాయి ప్రగతి పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాస వసంత పంచమి వేడుకలు

**రామగిరి, విశాలభారతి:** రామగిరి మండలం కల్వచర్ల లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మరియు బేగంపేట లోని సాయి ప్రగతి విద్యానికేతన్ లో చదువుల తల్లి సరస్వతి దేవి జన్మదినం శుక్రవారం వసంత పంచమి పర్వదినం పురస్కరించుకుని సరస్వతి దేవిని ప్రార్థించి అత్యంత భక్తిశ్రద్ధలతో అక్షరాభ్యాస వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు పాల్గొని తొలి అక్షరాలు రాసి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. విద్యాభ్యాసానికి తొలిమెట్టైన అక్షరాభ్యాసాన్ని శుభప్రదమైన శుక్రవారం నిర్వహించడం ఎంతో విశేషమని పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి అన్నారు. పాల్గొన్న 65 మంది విద్యార్థులలో డ్రా పద్ధతిన ఒక్కరిని ఎంపిక చేసిన I.హన్షూ శ్రీ (సబ్బితం) కి ఒక సంవత్సరం పాటు ఉచిత విద్య అందిస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల. శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### వివాహ వేడుకలో మౌనీ రాయ్‌కు

# చేదు అనుభవం

బాలీవుడ్ నటి మౌనీ రాయ్‌కు హర్యానాలోని కర్నాల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకలో తీవ్ర అసహ్యకరమైన అనుభవం ఎదురైంది. ఈ ఘటనపై ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తాను ఎదుర్కొన్న వేధింపులను బహిరంగంగా వెల్లడించారు. స్టేజ్‌పై ప్రదర్శన ఇవ్వడానికి వెళ్తున్న సమయంలో ఫోటోలు తీసే నెపంతో కొందరు వృద్ధులు, పురుషులు అసభ్యంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. నడుముపై చేతులు వేయడం, దగ్గరికి వచ్చి అనుచితంగా తాకడం వంటి చర్యలు తనను తీవ్రంగా కలిచివేశాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో మరింత ఆందోళన కలిగించిన విషయం ఏమిటంటే, తాను అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ కొందరు దురుసుగా స్పందించారని మౌనీ రాయ్ తెలిపారు. “నేను స్పష్టంగా వద్దని చెప్పినా, వాళ్లు వెనక్కి తగ్గలేదు. ఇది చాలా అవమానకరంగా అనిపించింది” అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, స్టేజ్‌పై ప్రదర్శన ఇస్తున్న సమయంలో కూడా సమస్యలు ఆగలేదని పేర్కొన్నారు. స్టేజ్ కింద నుంచి కొందరు వ్యక్తులు అసభ్య సంకేతాలు చేయడం, అభ్యంతరకరమైన పదజాలంతో వేధించడం తనను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిందని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో ఆర్గనైజర్లు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మౌనీ రాయ్ మండిపడ్డారు. తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించినప్పటికీ, నిర్వాహకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పరిస్థితిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. “ఇలాంటి ఈవెంట్లలో ఆర్టిస్టుల భద్రతకు కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడం బాధాకరం” అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో మౌనీ రాయ్‌కు మద్దతుగా పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. అభిమానులు, నెటిజన్లు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తూ, మహిళల భద్రతపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పబ్లిక్ ఈవెంట్లలో మహిళా కళాకారులకు సరైన భద్రత కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. మౌనీ రాయ్ ఎదుర్కొన్న ఈ చేదు అనుభవం, సెలబ్రిటీలైనా సరే మహిళలు ఎదుర్కొనే వేధింపుల వాస్తవాన్ని మరోసారి బయటపెట్టిందని విశ్లేషకులు అంటున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.